బుధవారం 25 మార్చి 2026 https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## ఉత్తరాంధ్ర...
# ఇక ఉక్కు ఆంధ్ర

అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు

- ఎక్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- వివరాలు 2 లో..

## జేజేఎం 2.0తో 2028నాటికి
# ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు



- ప్రాజెక్టు అమలు, నిర్వహణపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం
- గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం అవుతుందన్న ముఖ్యమంత్రి
- మహిళల నీటి కష్టాలు తీరతాయన్న కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్
- జేజేఎం 2.0 ఒప్పంద కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న సీఎం చంద్రబాబు

3



# ఆర్డీటీకి జీవం పోశారు

## సీఎం చంద్రబాబు, లోకేష్‌కు మాంచో ఫెర్రర్ కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని క్యాంప్ కార్యాలయంలో కలిసిన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు మాంచో ఫెర్రర్. ఆర్డీటీ సంస్థ ఏపీలో దశాబ్దాలుగా పేదలకు సేవలందిస్తోంది. కొద్దికాలంగా ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టులోని నిబంధనల కారణంగా ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులు నిలిచిపోయాయి. ఈ సమస్యను పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు... కేంద్రమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. తాజాగా దీనికి సంబంధించి కేంద్రం నుంచి క్లియరెన్స్ రావడంతో అడ్డంకులు తొలిగాయి. దీనికి కృతజ్ఞతగా మాంచో ఫెర్రర్ సీఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర నిర్ణయంతో పేదలకు ఎప్పటిలా నిరాటంకంగా సేవలు అందుతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

V

# విద్యుత్ సంస్థల రుణాలు తీరేలా ప్రణాళిక

- ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ ఫండ్
- ప్రజలపై విద్యుత్ భారం తగ్గేలా సంస్కరణలు
- విద్యుత్ కొనుగోలు ధర యూనిట్ రూ.4కు తగ్గాలి
- పీఎం సూర్యఘర్ పథకం మరింత చేరువవ్వాలి
- విద్యుత్ సంస్థల సమర్ధ నిర్వహణతో రూ.339 కోట్లు ఆదా
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2



## సీఎం చంద్రబాబుతో
# బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ భేటీ

ఏపీలో సినిమా షూటింగ్‌లు, ఫిలిం ప్రొడక్షన్ అంశాలపై చర్చ

3

## ప్రజా ఆశీస్సులే
# చంద్రబాబుకు శ్రీరామరక్ష



- పాలనా దక్షతపై నమ్మకంతో పెద్దఎత్తున పరిశ్రమలు
- అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం ప్రయోగశాల
- ఎంతో ఆదరించారు..వారి రుణం తీర్చుకుంటాం
- సమాజాభివృద్ధిలో మహిళా శక్తి కీలకం
- ప్రోత్సాహకాలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి

7



# ఇది తెలుగుదేశం 3.0 వర్షన్

- పార్టీలో సమూల మార్పులు తీసుకొచ్చి పటిష్టంగా ముందుకు తీసుకువెళ్తాం
- క్షేత్రస్థాయిలో పనిచేసేవారిని నేరుగా గుర్తించాలనేదే మా లక్ష్యం
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో బాగా పనిచేసిన 19మంది కార్యకర్తలకు వేదికపై అవకాశం
- తెలంగాణ తొలి, మలి ముఖ్యమంత్రులు తెలుగుదేశం యూనివర్సిటీనే
- తెలుగుదేశం పార్టీ నాయకులను తయారు చేసే కార్ఖానా
- 2019-24 మధ్య సామాన్య ప్రజలపై దాడి చేశారు
- కలిసికట్టుగా పనిచేస్తే మనం ఆశించిన మార్పు సాధ్యమవుతుంది
- టీడీపీ క్లస్టర్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్ల'లో లోకేష్ దిశానిర్దేశం

4




## రాజధాని అమరావతిలో
# నిప్పుపై నిగ్గు తేల్చండి

- పనులు వేగంగా జరుగుతున్న వేళ వరుస ఘటనలు... ప్రమాదాలా, కుట్రలా?
- కారణాలు వెలికి తీయండి: సీఎం చంద్రబాబు

2





## డిస్టిలరీ లేకున్నా
## రూ.732 కోట్ల బిజినెస్

లిక్కర్‌కుంభకోణంలో 5 విస్తుపోయే నిజాలు

15

## విజయవాడలో
# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- ఐసిస్ నెట్‌వర్క్ గుట్టురట్టు
- ఏడు రాష్ట్రాల్లో సోదాలు
- కేసులో ముగ్గురికి రిమాండ్

10



# విద్యుత్ సంస్థల రుణాలు తీరేలా ప్రణాళిక

- ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ ఫండ్
- ప్రజలపై విద్యుత్ భారం తగ్గేలా సంస్కరణలు
- విద్యుత్ కొనుగోలు ధర యూనిట్ రూ.4కు తగ్గాలి
- పీఎం సూర్యఘర్ పథకం మరింత చేరువవ్వాలి
- విద్యుత్ సంస్థల సమర్థ నిర్వహణతో రూ.339 కోట్లు ఆదా
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): విద్యుత్ కొనుగోలు ఛార్జీలను తగ్గించే అంశంపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇప్పటికే ఈ దిశగా చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించటంతోపాటు ప్రజలపై భారం వేయకుండా విద్యుత్ సంస్థల రుణాలు తీర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈమేరకు మంగళవారం సచివాలయంలో జరిగిన విద్యుత్ శాఖ సమీక్షలో సీఎం కీలక సూచనలు చేశారు. 2028-29 నాటికి విద్యుత్ కొనుగోళ్ల ఖర్చును తగ్గించేందుకు చేపట్టిన ప్రణాళికలను విద్యుత్ శాఖ అధికారులు సీఎం చంద్రబాబు ముందుంచారు. విద్యుత్ రంగంలోని వివిధ విభాగాల ద్వారా సంస్కరణలు చేపడితే మొత్తంగా యూనిట్ కు రూ.1.32 చొప్పున విద్యుత్ కొనుగోలు భారాన్ని తగ్గించవచ్చని సీఎంకు వివరించారు. 2028-29 నాటికి యూనిట్ కొనుగోలు ధరను రూ.4.10కు తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. రూ.4కు ఈ కొనుగోలు ధరను తగ్గించేలా చూడాలని సీఎం ఆదేశించారు. నూతన టెక్నాలజీని, ఇన్నోవేషన్లను వినియోగించుకుని విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. విద్యుత్ సంస్థల సమర్థ నిర్వహణతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.339 కోట్ల మేర ఆదా చేశామని...ఈ తరహా పొదుపు చర్యలను మరింతగా తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలను తెచ్చాం. దీని ఫలితాలు ప్రజలకు అందుతున్నాయి. ప్రజలకు మేలు చేయడానికి రిస్క్ తీసుకుని మరీ విద్యుత్ సంస్కరణలు అమలు చేశాం. ఎనర్జీ ఆడిటింగ్ అనే విధానాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే దేశంలో తొలిసారిగా చేపట్టాం. ఇప్పుడు విద్యుత్ రంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు పడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఎనర్జీ రంగం గేమ్ ఛేంజర్ కానుంది. తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ హిత విద్యుత్ ఉత్పత్తి వంటి అంశాలపై ప్రపంచ దేశాలు మొగ్గు చూపుతున్నాయి. వీటిని రాష్ట్ర ప్రభుత్వం అందిపుచ్చుకుంది కాబట్టే కీలకమైన పరిశ్రమలు ఏపీకి వచ్చాయి. గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి. రాష్ట్రంలో సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలి. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలి. వ్యవసాయ పంపు సెట్లకు పీఎం కుసుమ్ పథకం వినియోగించుకునేలా రైతుల్లో అవగాహన కల్పించాలి. సోలార్ విద్యుత్ ఉత్పత్తి విషయంలో దక్షిణ భారత దేశంలో ఏపీనే ముందు వరుసలో ఉంది. దేశంలోనే మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. వీటితో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు, విండ్ ఎనర్జీ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం వంటి వాటిని ఇంటిగ్రేట్ చేసుకోవాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### ఎనర్జీ యూనివర్శిటీని ఏర్పాటు చేయండి

"ఎనర్జీ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండండి. ఇతర దేశాల్లో విద్యుత్ రంగంలో జరుగుతున్న పరిణామాల్ని అధ్యయనం చేయండి. టెక్నాలజీని అందిపుచ్చుకునేలా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. విద్యుత్ రంగంలోని టెక్నాలజీలను.. ఇన్నోవేషన్లను ప్రోత్సహించేలా ఎనర్జీ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలి. విద్యుత్ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించాలి. మంచి ఆలోచనలతో వచ్చే స్టార్టప్ కంపెనీలకు అవసరమైన మేరకు మార్జిన్ మనీ సమకూర్చేలా విద్యుత్ సంస్థలు చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రత్యేకంగా ఇంక్యుబేషన్ ఫండ్ ఏర్పాటు చేసి స్టార్టప్ కంపెనీలకు ఆర్థికంగా చేయూత అందించాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విద్యుత్ రంగంలో ఏపీ చాలా ముందుంది. ఇతర రాష్ట్రాలకు సంస్థలకు కన్సల్టెన్సీ సేవలు అందించేలా ఏపీ విద్యుత్ సంస్థలు ఎదగాలి. విద్యుత్ సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ సంస్థలకు అప్పులు పెను భారంగా మారాయి. ఛార్జీలు పెంచకుండా...విద్యుత్ సంస్థలకు ఉన్న అప్పులను తీర్చేలా ప్రణాళికలు రూపొందించండి. భూగర్భజలాలు పెంచుకుని విద్యుత్ ఆదా చేస్తున్నాం. ఇప్పటికే ట్రూ అప్ భారాన్ని ప్రజలపై వేయకుండా చర్యలు తీసుకున్నాం. విద్యుత్ ఛార్జీల్లో 13 పైసల మేర ట్రూడౌన్ చేశాం. కొనుగోలు భారాన్ని కూడా తగ్గించగలిగితే.. ప్రజలకు మరింత మేలు చేయవచ్చు" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాజధాని అమరావతిలో

# నిప్పుపై నిగ్గు తేల్చండి

- పనులు వేగంగా జరుగుతున్న వేళ వరుస ఘటనలు... ప్రమాదాలా, కుట్రలా?
- కారణాలు వెలికి తీయండి: ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): రాజధాని అమరావతిలో నిప్పుపై నిగ్గు తేల్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాద ఘటనలు నిజంగా ప్రమాదాలా? లేక దాని వెనుక కుట్రకోణం ఉందా? అనేది వెలికి తీయాలని సీఎం ఆదేశించారు. వరుస ఘటనలు, అవి జరుగుతున్న తీరు చూస్తుంటే కుట్రకోణం ఉందనే అనుమానం వస్తోందని... ఆ దిశగా మరింత లోతుగా అన్ని కోణాల్లోనూ విచారణ జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గతంలో జరిగిన కొన్ని ఘటనలు... ఇప్పుడు రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కుట్రకోణం ఉందా? అనే విషయం కూడా విశ్లేషించి వాస్తవాలు బయటకు తీయాలన్నారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద నిర్మాణ సంస్థకు చెందిన పైపులు గత రాత్రి దగ్ధమైన ఘటనపై సచివాలయంలోని తన చాంబర్‌లో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా,గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్, ఇంటలిజెన్స్ చీఫ్ మహేష్‌కుమార్ లడ్హాలతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటన గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏ సమయంలో ప్రమాదం జరిగింది...? ఎన్నింటికి అగ్నిప్రమాదంపై ఫైరింజన్‌కు కాల్ వచ్చింది అనే విషయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్రమాద స్థలంలో అంత త్వరగా మంటలు వ్యాపించడానికి కారణాలుఏంటని అడిగి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ ద్వారా ఘటనకు కారణాలను కనిపెట్టాలని సీఎం ఆదేశించారు.

### సీసీ కెమేరాలు పెట్టాలి... పెట్రోలింగ్ పెంచాలి

"రాజధానిలో పెద్దఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కోట్ల విలువైన సామగ్రి రాజధాని ప్రాంతంలో నిల్వచేసి పెట్టారు. పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో జరుగుతున్న ఘటనవల్ల అనవసరమైన అడ్డంకులు ఏర్పడతాయి. ఈ నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాజధాని ప్రాంతంలో, పనులు జరుగతున్న దగ్గర అదనపు పెట్రోలింగ్ నిర్వహించాలి. ప్రతి నిర్మాణ సంస్థ తమ సామగ్రి నిల్వ చేసుకునే యార్డులో సీసీ కెమేరాలు తప్పక ఏర్పాటు చేయాలి. అదేవిధంగా సామగ్రి నిల్వ కేంద్రాల వద్ద వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. డ్రోన్ కెమేరాలు ద్వారా ఆయా ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షించాలి. తమ సామగ్రి ఉన్న యార్డుల వద్ద తగిన భద్రత ఏర్పాటు చేసుకోవడంతోపాటు, భద్రతా చర్యలు చేపట్టడంపై కూడా నిర్మాణ సంస్థలు దృష్టి పెట్టాలి. అలాగే అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలి. వారి రాకపోకలను కూడా గమనించాలి. అనుమానితులు ఉంటే ప్రశ్నించాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. వరుస ఘటనలో అలజడి సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తున్నట్టు తేలితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించ వద్దని... కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## ఉత్తరాంధ్ర...

# ఇక ఉక్కు ఆంధ్ర

- అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు
- ఎక్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): మాటిచ్చాం. మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీరంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ప్రతిష్టాత్మకమైన ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "21నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్నిచోట్లా ఆనందాన్ని, భవిష్యత్‌పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటవుతున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కురంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది.

ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహన్నిచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్నిరంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

# జేజెఎం 2.0తో 2028నాటికి

# ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు





- ప్రాజెక్టు అమలు, నిర్వహణపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం
- గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం అవుతుందన్న ముఖ్యమంత్రి
- మహిళల నీటి కష్టాలు తీరతాయన్న కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్
- జేజేఎం 2.0ఒప్పంద కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ పల్లెకు, ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీటిని నిరంతరాయంగా అందించే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ 2.0కింద 2028నాటికి రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయి లక్ష్యాన్ని సాకారం చేస్తామని వెల్లడించారు. మంగళవారం జల్ జీవన్ మిషన్ 2.0పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఢిల్లీలో కుదిరిన ఎంఓయూలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంప్ కార్యాలయంనుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ ఆపరేషన్, మెయింటెనెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి 2025 సెప్టెంబర్‌లోనే సమగ్ర విధానాన్ని ప్రకటించినట్టు గుర్తు చేశారు. తాగునీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జల్ జీవన్ మిషన్ అమలు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. జల్ జీవన్ మిషన్ 2028 వరకు కొనసాగిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలనాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనికి కేంద్రం సహకరించాలని ఈ సందర్భంగా సీఆర్ పాటిల్‌ను సీఎం కోరారు. జల్ జీవన్ మిషన్ 2.0 ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం అనంతరం సీఆర్ పాటిల్ మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు జల్ జీవన్ మిషన్ 2.0కు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీతో ఈ విషయంపై సంప్రదించారని, ఈ మిషన్ పొడిగింపు కోసం ప్రతిపాదించడంపై పాటిల్ ధన్యవాదాలు తెలిపారు.

### డ్వాక్రా సభ్యులకు నీటి నాణ్యత పరీక్ష బాధ్యత

"జల్ జీవన్ మిషన్ కార్యక్రమం మొదటిదశలో 16 కోట్లమంది గృహాలకు కుళాయిలు ఇచ్చాం. ప్రాజెక్టులో జరిగిన కొన్ని లోపాలను సవరించి నిర్వహణ కూడా చేపడుతున్నాం. మరో 3 కోట్ల ఇళ్లకు సురక్షితమైన తాగు నీటిని అందించాల్సి ఉంది. ఏపీలో నీటి నాణ్యతను పరీక్షించేందుకు డ్వాక్రా మహిళల సేవల్ని వినియోగించుకోవాలని కోరుతున్నా. జల్ జీవన్ మిషన్ ద్వారా వివిధ ప్రాంతాల్లో 9 కోట్లమంది మహిళలకు దూరంనుంచి నీరు తెచ్చుకునే కష్టాలు తప్పుతాయి. జేజెఎం 2.0 ద్వారా ఏపీలో ప్రతీ ఇంటికీ కుళాయి అనే లక్ష్యం నెరవేరుతుందని ఆశిస్తున్నాను. 2047 వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు చేరటం ముఖ్యం. సాగు కోసం కూడా రైతులకు రెండు సార్లు నీరందితే వారు కూడా సంతోషంగా ఉంటారు. జేజేఎం 2.0 పై త్వరలో ఏపీలో జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ మీటింగ్ ఏర్పాటు చేస్తే ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశించుకుందాం. పీఎం జన్‌మన్, పీఎం జన్ భాగీదారీ మిషన్‌లో భాగంగానూ సురక్షిత నీటిని మారుమూల ప్రాంతాలకు అందించేందుకు నిధులు వినియోగించుకోవాలని కోరుతున్నా. జల్ జీవన్ మిషన్ సాకారం అయ్యేందుకు కేంద్రంనుంచి పూర్తి సహకారం అందిస్తాం. ఏపీ పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి" అని కేంద్ర మంత్రి పాటిల్ చెప్పారు.

### 2028 డిసెంబర్‌నాటికి 'హర్ ఘర్ జల్'

ఢిల్లీలోని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ కార్యాలయంలో జేజేఎం 2.0పై కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు. తాజా ఎంఓయూతో మౌలిక సదుపాయాల కల్పన, పంచాయతీల ఆధ్వర్యంలో కుళాయిల నిర్వహణ వ్యవస్థను బలోపేతం కానుంది. 2028 డిసెంబర్ నాటికి 'హర్ ఘర్ జల్' సాకారం చేయాలనేది లక్ష్యం. ఢిల్లీలో ఎంఓయూ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి కార్యదర్శి అశోక్‌కుమార్ మీనా, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తదితర ఉన్నతాధికారులు హాజరుకాగా, అమరావతినుంచి వర్చువల్‌గా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో

# బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ భేటీ

## ఏపీలో సినిమా షూటింగ్‌లు, ఫిలిం ప్రొడక్షన్ అంశాలపై చర్చ







అమరావతి (చైతన్య రథం): బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి ఇద్దరిమధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో సినిమా రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నట్టు సంజయ్ దత్ ముఖ్యమంత్రికి వివరించారు. సినిమా షూటింగ్‌లకు ఏపీని కేంద్రంగా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఉన్న అవకాశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఫిలిం స్టూడియోలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వపరంగా ప్రణాళికలు ఉన్నాయని సంజయ్‌దత్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తద్వారా సినిమా, వినోదరంగాల్లో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి సంజయ్ దత్‌ను కోరారు.

చైతన్యరథం





# ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్

- పార్టీలో సమూల మార్పులు తీసుకొచ్చి పటిష్టంగా ముందుకు తీసుకువెళ్తాం
- క్షేత్రస్థాయిలో పనిచేసేవారిని నేరుగా గుర్తించాలనేదే మా లక్ష్యం
- పార్టీ ఆవిర్భావం దినోత్సవంలో బాగా పనిచేసిన 19మంది కార్యకర్తలకు వేదికపై అవకాశం
- తెలంగాణ తొలి, మలి ముఖ్యమంత్రులు తెలుగుదేశం యూనివర్సిటీనే
- తెలుగుదేశం పార్టీ నాయకులను తయారు చేసే కార్ఖానా
- 2019-24 మధ్య సామాన్య ప్రజలపై దాడి చేశారు
- కలిసికట్టుగా పనిచేస్తే మనం ఆశించిన మార్పు సాధ్యమవుతుంది
- టీడీపీ క్లస్టర్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్ల'లో లోకేష్ దిశానిర్దేశం



మంగళగిరి (చైతన్య రథం): "ఇది టీడీపీ 3.0 వర్షన్. పార్టీలో సమూల మార్పులు తీసుకొచ్చి ఇంకా పటిష్టంగా ముందుకు తీసుకెళ్తామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో టీడీపీ క్లస్టర్ ఇంఛార్జ్‌లకు శిక్షణ తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. "తెలుగుదేశం పార్టీ యూనివర్సిటీ లాంటిది. ఎంతోమంది గొప్ప నాయకులను తెలుగుదేశం పార్టీ తయారుచేసింది. తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి తెలుగుదేశం యూనివర్సిటీనే, రెండో ముఖ్యమంత్రి కూడా తెలుగుదేశం యూనివర్సిటీనే. తెలుగుదేశం పార్టీ నాయకులను తయారుచేసే కార్ఖానా. గతంలో గండిపేటలో నిరంతరం పార్టీ శిక్షణ తరగతులు జరిగేవి. చాలామంది ఉప ముఖ్యమంత్రులు అయినవారున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అయినవారు ఉన్నారు. ఇప్పుడు ఏడాదిలో కనీసం 300 రోజులు పార్టీ శిక్షణ తరగతులు జంగాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మేం మీకు పదవులి ఇస్తున్నాం, కానీ ఏం చేయాలో చెప్పడం లేదు. చాలామందికి వారి బాధ్యతలు ఏంటో తెలియవు. వేటి ఆధారంగా పార్టీ తమను గుర్తిస్తుందో చాలామందికి తెలియదు. ఈ శిక్షణ తరగతుల ద్వారా వారికి అవగాహన వస్తుంది" అన్నారు.

## దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది

"పార్టీలో పనిచేసే వారిని గుర్తించేందుకు యాప్ తీసుకొచ్చాం. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం వల్ల పనిచేసేవారిని, చేయనివారిని గుర్తించవచ్చు. ఓవైపు శిక్షణ తరగతులు, మరోవైపు 'మై టీడీపీ' యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ఓ కార్యక్రమానికి పిలుపునిస్తే దానిని సక్రమంగా నిర్వర్తించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. 2019నుంచి 2024 వరకు మనల్ని ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. అక్రమ కేసులు పెట్టారు. దేవాలయం లాంటి టీడీపీ కార్యాలయంపైనే దాడి చేశారు. ఏ తప్పూ చేయని చంద్రబాబుని 53 రోజులపాటు రాజమండ్రి జైలులో బంధించారు. దీంతో అందరం ఉద్యమించాం. ఆ ఉద్యమంవల్లే దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది. వైసీపీని 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారు. ఇందుకువారి అహంకారమే కారణం. నాకు రాష్ట్రంలో మూడో అత్యధిక మెజార్టీ వచ్చిందని అహంకారానికి పోకూడదు. అందరినీ కలుపుకొని పోవాలి. కులాలకు అతీతంగా అందరూ నాకు ఓటేశారు కనుకనే అంత మెజార్టీ వచ్చింది. నాపై బాధ్యత పెరిగింది. నా పనులు సక్రమంగా చేస్తున్నాను. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి. ప్రజలు అహంకారాన్ని ఒప్పుకోరు. అది గమనించాలి" అన్నారు.

## 2019-24మధ్య సామాన్య ప్రజలపై దాడి చేశారు

తెలుగుదేశం పార్టీలో క్లస్టర్లది చాలా కీలకపాత్ర. యూనిట్, బూత్‌లను సమర్థంగా నడిపించగల వ్యక్తులు మీరు. మీపై బాధ్యత ఉంది. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమీక్షించాలి. మీరు పార్టీని నడిపించాలి. అందుకే పార్టీ సిద్ధాంతాలు, విధులు, బాధ్యతలపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలు పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం. 2019-24 మధ్య సామాన్య ప్రజలపై దాడి చేశారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు, ఆయన భార్య కలిసి హత్య చేశారు. డాక్టర్ సుధాకర్‌ను హింసించారు. తన సోదరిని వేధిస్తున్నారని ప్రశ్నించిన అమర్ నాథ్ గౌడ్‌ను చంపారు. మన పార్టీకి చెందిన తోట చంద్రయ్యను హత్య చేశారు. ఇవన్నీ మనం మర్చికూడదు. ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలి" అని దిశానిర్దేశం చేశారు.

## పార్టీకే ప్రథమ ప్రాధాన్యత

"తెలుగుదేశం పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు వంటింది. వారంలో ఒక రోజు పార్టీ కార్యాలయానికి సమయం కేటాయిస్తున్నాను. ఆ వారంలో నా శాఖకు సంబంధించిన కార్యక్రమం ఉన్నా పార్టీకే ప్రాధాన్యత ఇస్తున్నా. అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రతి బూత్ లో మెజార్టీ తీసుకువస్తే 175 స్థానాల్లో విజయం సాధించవచ్చు. నాకు 91వేల మెజార్టీ వచ్చినా 8శాతం బూత్ లలో మైనస్ వచ్చింది. దీంతో ఇప్పటి నుంచే నేను కసరత్తు చేస్తున్నా. రాష్ట్రవ్యాప్తంగా బలహీనంగా ఉన్న బూత్‌ల బలోపేతంపై దృష్టిసారించాం. క్లస్టర్ పరిధిలో ఉన్న బలహీన బూత్‌ల బలోపేతంపై మీరు దృష్టిసారించాలి" అని సూచించారు.

## క్లస్టర్ ఇంఛార్జ్ పొలిట్‌బ్యూరో స్థాయివరకు ఎదగాలి

"పార్టీలో కూడా నిరంతరం మార్పు రావాలి. ఒక వ్యక్తి ఒక పదవిలో మూడు సార్లు కంటే ఎక్కువగా ఉండకూడదు. క్లస్టర్ ఇంఛార్జ్ పొలిట్ బ్యూరో స్థాయి వరకు రావాలి. గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరోలో కూర్చోవాలి. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఇది నాకు నాలుగోసారి. ఈసారి నాకు ఆ బాధ్యత వద్దని మన నాయకుడికి చెప్పా. వేరేవారికి అవకాశం ఇవ్వాలని, పార్టీలో పనిచేసే వారు చాలామంది ఉన్నారని చెప్పా. ఈ సంస్కరణ కోసం పార్టీలో నేను నాలుగేళ్లు పోరాడా. మంచి కోసం మార్పులు తీసుకువస్తున్నాం. నేను అనుకున్న మార్పులు తీసుకువచ్చే వరకు వదిలిపెట్టను. ఒకటికి పదిసార్లు చర్చించాలి. నమ్ముకున్న సిద్ధాంతం కోసం మనం పోరాడాల్సిన అవసరం ఉంది. అలిగి ఇంట్లో కూర్చొంటే నష్టపోతాం. బహిరంగ వేదికలపై కాకుండా ఎవరైనా తమ అభిప్రాయాలను 'మై టీడీపీ' యాప్ ద్వారా తెలియజేయవచ్చు. మేం తీసుకునే పది నిర్ణయాల్లో మూడు తప్పవుతాయి. సరిదిద్దుకునేందుకు మేం సిద్ధంగా ఉన్నాం" అని లోకేష్ వివరించారు.

## ఇది టీడీపీ 3.0 వర్షన్

"ఏ పార్టీలోనూ ఈవిధంగా శిక్షణ తరగతులను నిర్వహించడం లేదు. మేం కార్యకర్తల కష్టసుఖాలను తెలుసుకుంటున్నాం. ఇదీ తెలుగుదేశం పార్టీ అంటే. కలిసికట్టుగా పనిచేస్తే మనం ఆశించిన మార్పు సాధ్యమవుతుంది. పనిచేసిన వారిని ప్రోత్సహిస్తాం. మధ్యవర్తులు లేకుండా క్షేత్రస్థాయిలో పనిచేసే వారిని నేరుగా గుర్తించాలనేదే మా లక్ష్యం. ఇవాళ చంద్రబాబు చుట్టూ కోటరీ లేదు. అన్ని విషయాలను ఆయన నేరుగా తెలుసుకుంటున్నారు. నేనుకూడా క్షేత్రస్థాయినుంచి అభిప్రాయాలు తీసుకుంటాను. ఇది కొత్త పార్టీ టీడీపీ 3.0 వర్షన్‌కి వచ్చాం. మార్పు తీసుకువస్తాం. ఇంకా పటిష్టంగా ముందుకు తీసుకువెళ్తాం. 'మై టీడీపీ' యాప్ ద్వారా కార్యక్రమాలు చేపడతాం. అందరూ యాప్‌తో అనుసంధానం కావాలి. పనిచేసే వారిని గుర్తిస్తాం. ఈనెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో వేదికపై పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుతోపాటు 'మై టీడీపీ' యాప్, క్లస్టర్, మండల పార్టీ అధ్యక్షుడు, అనుబంధ విభాగాలు.. ఈ విధంగా రాష్ట్రంలోనే నెం.1గా నిలిచిన 19మంది కార్యకర్తలను గుర్తించి నాయకుడితోపాటు వేదికపై కూర్చొనే అవకాశం కల్పిస్తాం. కార్యకర్తే అధినేత అనేది మా శాసనం. అది మా గైడింగ్ ప్రిన్సిపుల్, మా గైడింగ్ ఫోర్స్. ఏ కార్యక్రమం చేసినా కార్యకర్తలను గుర్తించాలనే లక్ష్యం పెట్టుకున్నామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వివరించారు.







# తాడేపల్లిలో మెడ్ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

తాడేపల్లి (చైతన్య రథం): మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణంలోని ఆశ్రమం రోడ్డులో నూతనంగా నిర్మించిన మెడ్ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రి మొత్తం కలియతిరిగి అత్యాధునిక వైద్య సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, మెడ్ స్టార్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బొర్రా విజయ్ చైతన్య, ఛైర్మన్ బొర్రా లక్ష్మీ సింధూర, మెడ్ స్టార్ హాస్పిటల్ డైరెక్టర్ పర్చూరి సాయికుమార్, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

















## టీడీపీ కేంద్ర కార్యాలయంలో

# లోకేష్ 85వ రోజు ప్రజాదర్బార్

- ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ

మంగళగిరి (చైతన్య రథం): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ 85వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి నారా లోకేష్‌ను కలిసి సమస్యలు విన్నవించేందుకు వివిధ జిల్లాలనుంచి ప్రజలు, టీడీపీ కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వివిధ సమస్యలపై వారినుంచి అర్జీలు స్వీకరించారు.

రాష్ట్రంలో కేబుల్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఏపీ ఫైబర్ నెట్‌లో కాలంతీరిన బాక్స్‌లకు 59 రూపాయల రెంటల్‌ను తొలగించాలని ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సమస్యను సంబంధిత మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అనుమర్లపూడిలో తన 0.81 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ముత్తే సాంబశివరావు కోరారు.

రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని, న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తీసుకురావాలని ఏలూరుకు చెందిన నిమ్మల జ్యోతికుమార్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడ మొగల్రాజపురంలోని తమ ఖాళీ స్థలానికి సంబంధించి వేరొక వ్యక్తి పేరుపై అక్రమంగా ఇంటి పన్ను విధించిన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు సదరు పన్నును రద్దుచేసి న్యాయం చేయాలని గూడపాటి కోటేశ్వరరావు కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.















## తెలుగు ప్రజలకు శుభవార్త

**లక్షలాది జనం సంతోషించే సమాచారం**

**యథావిధిగా ఆర్డీటీ సేవలు: నారా లోకేష్**

అమరావతి (చైతన్య రథం): తెలుగు ప్రజలకు శుభవార్త చెప్పారు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్. ప్రజల జీవితాల్లో ఒక భాగమైన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సేవలు కొనసాగుతాయని ప్రకటించారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "ఆర్డీటీ సేవలు నిరంతరాయంగా అందేలా చూస్తానని మాటిచ్చాను. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపాం. పేదల ఇళ్లలో వెలుగు.. నిరుపేద పిల్లల చదువు.. ఉపాధి, ఆర్థిక సాధికారత, వైద్య సేవలు అందించే ఆర్డీటీ దశాబ్దాలుగా చేస్తున్న కృషిని వివరించాను. ఆర్డీటీకి అడ్డంకులు తొలగిపోయాయి. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఆర్డీటీ రెన్యువల్ అయ్యింది. ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వ పెద్దలు, అధికారులందరికీ కృతజ్ఞతలు. దశాబ్దాల సేవాస్ఫూర్తి రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు మాంచో ఫెర్రర్‌కు అభినందనలు" అని లోకేష్ పేర్కొన్నారు.

## కుప్పం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్

# వివాహ వేడుకలకు భువనేశ్వరి

*కుప్పం టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన కుప్పం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రోహిత్, కావ్య వివాహానికి నారా భువనేశ్వరి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.*





# ప్రజా ఆశీస్సులే చంద్రబాబుకు శ్రీరామరక్ష

- పాలనా దక్షతపై నమ్మకంతో పెద్దఎత్తున పరిశ్రమలు
- అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం ప్రయోగశాల
- ఎంతో ఆదరించారు.. వారి రుణం తీర్చుకుంటాం
- సమాజాభివృద్ధిలో మహిళా శక్తి కీలకం
- ప్రోత్సాహకాలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి





కుప్పం(చైతన్యరథం): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి, ప్రజలకు సంక్షేమం అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్య మని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా ముందుగా కుప్పం నియోజకవర్గం నుంచే ముఖ్య మంత్రి మొదలుపెడతారని పేర్కొన్నారు. సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర..వారు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు..వారి ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది..వాటిని అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎద గాలని సూచించారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు మంకలదొడ్డి, సింగారపురం, మోట్లచెను, కూసురు గ్రామాల్లో పర్యటించిన ఆమె మహిళలతో సమావేశమయ్యారు.

## కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటాం

ముందుగా కుప్పం నియోజకవర్గం మంకలదొడ్డి గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరికి స్థానికులు ఘన స్వాగతం పలి కారు. గ్రామంలోని కాళికా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. కుప్పం నియోజకవర్గ ప్రజలకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉం టుంది. ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఎంతో ఆదరించారు. చంద్రబా బును 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. ముఖ్యమంత్రిగా ఆయన నియోకవర్గంలోని ప్రతి గ్రామం తిరగడం సాధ్యం కాదు..అందుకే ఆ బాధ్యత నేను తీసుకున్నాను. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇక్కడ పర్యటిస్తున్నాను. గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలతో స్వయం గా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజల దీవెనలు మర్చిపోలేను

గత ప్రభుత్వంలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశాం. రాష్ట్రాన్ని బాగుచేయడం చంద్రబాబు వల్లే అవుతుందనే నమ్మకం తో ప్రజలు గెలిపించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. నేను గతంలో పబ్లిక్‌గా మాట్లాడింది లేదు. హెరిటేజ్ వ్యవహారాలు మాత్రమే చూసుకునేదాన్ని. నిజం గెలవాలి యాత్ర చేపట్టినప్పుడు రాష్ట్ర ప్రజలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు నన్ను ముందుండి నడిపించారు. వారు అందించిన సహకారం నేను ఎప్పటికీ మర్చి పోలేను. సమాజం అభివృద్ధి చెందడంలో మహిళలదే ముఖ్యపాత్ర. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం శుభ పరిణామం. వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. పురుషులు తమ వృత్తిలో రాణిం చాలంటే కుటుంబ మద్దతు ఎంతో అవసరం. ప్రజాసేవలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు తాను, బ్రాహ్మణి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## కుప్పానికి పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు

ఒక పరిశ్రమ పెట్టే ముందు పారిశ్రామికవేత్తలు లాభ,నష్టాలు బేరీజు వేసుకుంటారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి పరిశ్రమలు రాలేదు. కూటమి ప్రభుత్వంలో వచ్చాక సీఎం చంద్రబాబు పాలనా దక్షతపై నమ్మకంతో రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు తరలి వస్తున్నాయి. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి రూ.7,121 కోట్ల విలువైన పెట్టుబడులతో 17 పరిశ్రమలు తీసుకొచ్చారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలో రూ. 2,203 కోట్ల పెట్టుబడులతో 7 పరిశ్రమలు స్థాపించారు. వీటి ద్వారా 7093 మందికి ప్రత్యక్షంగా, 15,237 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కుప్పంలో అడిడాస్ కంపెనీ ఫుట్ వేర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. మహిళలు స్వయం సమృద్ధి సాధించడం కోసం చంద్రబాబు ఎలీప్ సంస్థను కుప్పానికి తీసుకొచ్చారు. ఇందులో శిక్షణ తీసుకున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. కుప్పానికి హంద్రినీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామా ల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేశారు. చెత్త ద్వారా సంపద సృష్టికి చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ స్పోర్ట్ కాంప్లెక్స్ తెచ్చారు. మంకలదొడ్డి గ్రామానికి రోడ్ కనెక్టివిటీ నిమిత్తం రూ.4 కోట్లకు పైగా వ్యయంతో బీటీ రోడ్లు వేశారని తెలిపారు. కుప్పం మండలం టి.సదుమూరు గ్రామంలో అంగన్వా డీ కేంద్రాన్ని సందర్శించిన నారా భువనేశ్వరి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. టి.సదుమూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు.

## గత పాలకులు రాష్ట్రాన్ని దోచేశారు

సింగారపురంలో మారెమ్మ దేవాలయంలో పూజలు చేసిన అనంతరం గ్రామ మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. గత పాలకులు రాష్ట్రాన్ని దోచేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల కష్టాలు తీరాయి. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయంటే అందుకు చంద్రబాబుపై ఉన్న నమ్మకమే కారణం. కూటమి ప్రభుత్వం అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తోంది. యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పిస్తోంది. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. అనకాపల్లి జిల్లాలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రజా ప్రభుత్వం పీ4 ద్వారా పేదలను ఆర్థికంగా పైకి తెస్తోంది. కుప్పం నియోకవర్గంలో ప్రతి గ్రామానికి సంక్షేమం అందేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారు. సింగారపురం గ్రామానికి రూ.23 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు వేయడం జరిగింది. స్థానికం గా బ్రిడ్జ్ నిర్మాణానికి నా వంతు కృషి చేస్తాను. కుప్పంలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తున్నారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేస్తున్నారు. ఎలీప్ ద్వారా మహిళలు శిక్షణ తీసుకుని పారిశ్రామివేత్తలుగా ఎదగాల ని పిలుపునిచ్చారు.

## కుప్పం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేకదృష్టి

కుప్పం మండలం మోట్లచెను గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి ముందుగా మాజీ ఎంపీటీసీ నివాసానికి వెళ్లారు. అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. తర్వాత కూసూరు గ్రామంలో పర్యటించిన భువనేశ్వరి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమం అందుతోంది. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. ఏపీని కరువు రహిత రాష్ట్రంగా చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. మహి ళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. సంజీవని హెల్త్ క్లీనిక్స్ ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు. మోట్ల చెను పంచాయతీల పరిధిలో 104 స్ట్రీట్ లైట్స్ అమర్చారు. సీఎంఆర్ ఎఫ్ కింద ఐదుగురికి ఆర్థిక సాయం అందింది. జలజీవన్ మిషన్ కింద 100 ఇళ్లకు కుళాయిల ద్వారా సురక్షిత నీరు అందిస్తున్నారని తెలిపారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించారని, ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తు న్నారని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో సీఎం చంద్రబా బు ముందుకెళుతున్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వా ములు కావాలని కోరారు.

## జీవితంలో క్రమశిక్షణ ముఖ్యం

కుప్పం మండలం పైపాల్యం గ్రామంలో విలువల బడి కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొని విద్యార్థులతో ముచ్చటించా రు. విద్యార్థులు చిన్నతనం నుంచి వినూత్నంగా ఆలోచించాలని సూచించారు. నేను చదువుకునేప్పుడు మోరల్ సైన్స్ సబ్జెక్ట్ ఉండేది. ఆ తర్వాత కాలంలో సబ్జెక్ట్ తీసేశారు. ఈ సబ్జెక్ట్ పెట్టా లని లోకేష్‌ని కోరాను. నాన్న ఎన్టీఆర్ పేద కుటుంబంలో పుట్టి కష్టపడి ఉన్నత స్థానానికి వచ్చారు. చిన్నతనంలో ఆయన సైకిల్ పై ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. వీధి దీపాల కింద కూర్చు ని చదువుకునేవారు. చంద్రబాబు కూడా చిన్నతనంలో కిలోమీట ర్లు నడిచి బడికి వెళ్లేవారు. పిల్లల ఎదుగుదలలో తల్లి పాత్ర ముఖ్యమైంది. పిల్లలు అదే పనిగా సెల్‌ఫోన్లు వాడటం ప్రమాదా నికి దారితీస్తోంది. టెక్నాలజీని అవసరానికే వాడాలి. చిన్నతనం లో ఫోన్లు, టీవీలు లేవు కాబట్టే సంతోషంగా ఉండేవారమని పిస్తుంది. అన్ని మాకే తెలుసు అనే అహంభావం ఎవరికీ ఉండకూడదు. అహంకారం మనల్ని పాతాళానికి నెట్టేస్తుంది. పిల్లలు క్రమశిక్షణగా ఉండి తల్లిదండ్రులను గౌరవించాలి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై మనుషుల మధ్య దూరం పెరిగింది. మొదటి నుంచి ఉమ్మడి కుటుంబం వల్లే మేమంతా కలిసిమెలిసి ఉంటున్నామని తెలిపారు.





చైతన్యరథం



## అభివృద్ధికి

# కుప్పం ప్రయోగశాల

**ప్రజల దీవెనలు మర్చిపోలేను - కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి**
**గ్రామాల్లో పెద్దఎత్తున ఘనస్వాగతం**

కుప్పం నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరి తొలిరోజు మంకలదొడ్డి, సింగారపురం, మోట్లచెను, కూసురు, పైపాల్యం గ్రామాల్లో పర్యటించారు. పెద్దఎత్తున గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రాన్ని బాగుచేయడం చంద్రబాబు వల్లే అవుతుందనే నమ్మకంతో ప్రజలు గెలిపించారు. ప్రజల దీవెనలు మర్చిపోలేను. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం ప్రయోగశాల అని అభివర్ణించారు.



















# ప్రజారోగ్యానికి విజనరీ అండ!

## - ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా కూటమి సంస్కరణలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగు నూతన సంవత్సరం తొలి రోజున తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పేదలకు ఆర్థిక, వైద్య సాయం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి దస్త్రంపై తొలి సంతకం చేశారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా **6,787** మంది లబ్ధిదారులకు రూ.**55.63** కోట్ల నిధులను విడుదల చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, పేదల ఆరోగ్యం, అవసరాల కోసం వెనకాడబోమని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యరంగం కొత్త దిశలో ముందుకెళ్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆరోగ్య వ్యవస్థను పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. గత పాలనలో బకాయిల భారంతో కుదేలైన వైద్యరంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, పేదలకు వైద్య భరోసా, అత్యవసర సేవల బలోపేతం, డిజిటల్ పారదర్శకత వంటి అంశాలపై దృష్టి పెట్టింది.

### పేదలకు ప్రాణాధారమైన సీఎంఆర్ఎఫ్

ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రస్తుతం పేదలకు ప్రాణాధారంగా మారింది. అత్యవసర వైద్య చికిత్సలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తూ వేలాది పేద కుటుంబాలకు భరోసానిస్తోంది. 2019 నుండి 2024 వరకు గత ప్రభుత్వ కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా కేవలం రూ.897 కోట్లు మాత్రమే విడుదల కావడంవల్ల పేదలకు తగిన సహాయం అందలేదు. ఏడాదికి సగటు రూ.180 కోట్లకూ చేరని ఈ విడుదలలు అత్యవసర వైద్య అవసరాలను తీర్చలేకపోయాయి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. కేవలం 21 నెలల కాలంలోనే రూ.1,241 కోట్లు విడుదలచేసి 1.36 లక్షలమందికి పైగా సహాయం అందించింది. ఉగాది 2026 సందర్భంగా రూ.55.63 కోట్లు విడుదల చేసి 6,787 మందికి నేరుగా సహాయం అందించడం కూటమి ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనం. ఇది కేవలం గణాంకం కాదు.. ప్రతి విడుదల వెనుక ఒక కుటుంబానికి ఇచ్చిన జీవన భరోసా ఉంది.

### ప్రచారం కాదు -పేదలకు నిజమైన వైద్య భరోసా

గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల ఉచిత వైద్యం ప్రకటించినప్పటికీ, నెట్‌వర్క్ ఆసుపత్రులకు వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టింది. దీంతో అనేక ఆసుపత్రులు రోగులను తీసుకోవడంలో వెనుకంజ వేశాయి. పేద కుటుంబాలు అప్పులు చేసి చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చేందుకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని బలోపేతం చేసింది.

ఇందుకుగానూ 2026-27 బడ్జెట్‌లో రూ.4,000 కోట్లు కేటాయించింది. 2,200 పైగా ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చి, నెలకు రూ.400 కోట్లకు పైగా ఖర్చు చేస్తూ పేదలకు నిరంతర వైద్య భరోసా కల్పిస్తోంది. అంతేకాక నెట్ వర్క్ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులను చెల్లించడం ద్వారా వైద్య వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరించింది.

### ఆరోగ్యరంగానికి అధిక ప్రాధాన్యత

2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆరోగ్యశాఖకు రూ.19,306 కోట్లు కేటాయించడం ప్రభుత్వ దూరదృష్టిని తెలియజేస్తోంది. ఇది రాష్ట్ర బడ్జెట్‌లో 5.88 శాతం. గత ఏడాదితో పోలిస్తే గణనీయమైన పెరుగుదల. గత పాలనలో పేరుకుపోయిన రూ.6,486 కోట్ల బకాయిలను సరిదిద్దుతూ, ఔషధ సరఫరా, వైద్యుల నియామకం, ఆసుపత్రుల నిర్వహణవంటి అంశాలను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తోంది. ఆర్థిక క్రమశిక్షణతో ఆరోగ్యరంగాన్ని బలోపేతం చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

### ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి

ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించేందుకు రూ.3,066 కోట్లు మూలధన వ్యయంగా కేటాయించడం కూటమి కీలక నిర్ణయం. నిలిచిపోయిన ఆసుపత్రి నిర్మాణాలను పూర్తి చేయడం, ప్రతి నియోజకవర్గంలో 300 పడకల స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతోంది. క్యాన్సర్ కేర్ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, ఆధునిక పరికరాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలకు మరింత దగ్గర చేస్తోంది.

### నివారణ వైద్యం, అత్యవసర సేవలు

సంజీవినివంటి కార్యక్రమాల ద్వారా ముందస్తు ఆరోగ్య పరీక్షలను ప్రోత్సహించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత. కుప్పంలో నిర్వహించిన పైలట్ ప్రాజెక్ట్ ద్వారా వేలాదిమందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హై రిస్క్ కేసులను ముందుగానే గుర్తించడం జరిగింది. 104, 108 అంబులెన్స్ సేవలను బలోపేతం చేసి, గోల్డెన్ అవర్ సూత్రాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నారు. గ్రామాల్లోనే డయాగ్నోస్టిక్ పరీక్షలు అందించడం ద్వారా ప్రజలకు వైద్య సేవలను దగ్గర చేశారు.

### డిజిటల్ హెల్త్ -పారదర్శక పాలన

4.84 కోట్ల అభా అకౌంట్ల సృష్టి ద్వారా డిజిటల్ హెల్త్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. ఏప్రిల్ 1నుంచి యూనివర్సల్ హెల్త్ కవరేజ్ అమలుకు ప్రభుత్వం అడుగులేస్తోంది. డిజిటల్ రికార్డులు, పారదర్శక చెల్లింపులు, సమర్థవంతమైన మానిటరింగ్ ద్వారా ఆరోగ్య వ్యవస్థను ఆధునికీకరిస్తోంది.

### సీహెచ్‌వో సమస్యల పరిష్కార దిశగా చర్యలు

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు గత ప్రభుత్వ కాలం నుంచే పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం చర్చల ద్వారా దశలవారీ పరిష్కారం దిశగా ముందుకు సాగుతోంది. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో సీహెచ్‌వోల పాత్రను గుర్తించి వారి సేవలను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటోంది.

### ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం

గత ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రకటనలు చేసినప్పటికీ, వాస్తవానికి ఆరోగ్యరంగాన్ని బకాయిల భారంతో కుదేలుచేసింది. ఆసుపత్రులకు చెల్లింపులు లేకపోవడం, ఔషధాల కొరత, అత్యవసర సేవల బలహీనత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాత్రం మాటలకంటే పనికి ప్రాధాన్యత ఇస్తూ వైద్య రంగాన్ని పునరుద్ధరించే దిశగా ముందుకు సాగుతోంది. సీఎంఆర్ఎఫ్, ఎన్టీఆర్ వైద్యసేవ, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, అత్యవసర సేవల బలోపేతం, డిజిటల్ హెల్త్ వ్యవస్థవంటి చర్యల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతోంది.

ప్రజారోగ్యం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన బాధ్యతనే భావనతో కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య భరోసా కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తోంది. అత్యవసర వైద్య సహాయం, ఆసుపత్రుల ఆధునీకరణ, చికిత్స సౌకర్యాల విస్తరణవంటి చర్యలు ఆరోగ్యరంగాన్ని స్థిరంగా ముందుకు నడిపిస్తున్నాయి. ప్రచారంకంటే పరిపాలనే ముఖ్యమని ప్రభుత్వం తన కార్యాచరణతో నిరూపిస్తోంది. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం దిశగా తీసుకుంటున్న ఈ నిర్ణయాలు భవిష్యత్ తరాలకు బలమైన పునాదిగా నిలుస్తాయి.

- శాంతి జలసూత్రం, అనలిస్ట్,
టీడీపీ నాలెడ్జ్ సెంటర్








చైతన్యరథం

# మాట ఇచ్చారు.. నిలబెట్టుకున్నారు

- మంత్రి నారా లోకేష్ చొరవతోనే ఆర్డీటీకి పునరుజ్జీవం
- కృతజ్ఞతలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం:) 'వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ విషయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. 1969 నుంచి జిల్లా ప్రగతికి నిరంతరం కృషి చేస్తున్న ఈ సంస్థ ఎదుర్కొంటున్న ప్రధాన అడ్డంకిని తొలగించడంలో ఆయన విజయం సాధించారు. లోకేష్ వ్యక్తిగత చొరవతో నే కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి సంబంధించిన ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్‌ను పునరుద్ధరించింది. దీనివల్ల సంస్థకు అంతర్జాతీయ నిధుల సేకరణకు మార్గం సుగమమైంది. అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ ఆర్డీటీ సమస్యను లోకేష్ అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్నారని తెలిపారు. ఢిల్లీ పర్యటనల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు ఇతర కేంద్ర మంత్రులను కలిసి అనంతపురం జిల్లాకు ఆర్డీటీ చేస్తున్న నిరుపమాన సేవలను వివరించారు. సంస్థ ఎదుర్కొంటున్న పరిపాలనాపరమైన ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి లైసెన్స్ వచ్చేలా నిరంతరం పర్యవేక్షించారన్నారు.

'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్డీటీ అనేక ఇబ్బందులకు గురైంది. 2021 జూన్‌లో సంస్థ భూములకు సంబంధించి నోటీసులు జారీ చేయగా హైకోర్టు స్టే ఇచ్చింది. 2022 మే నెలలో అనంతపురం రూరల్ మండలం సోమలదొడ్డి గ్రామంలోని ఆర్డీటీ భూములను ఆక్రమించేందుకు స్థానిక రాజకీయ నేతలు ప్రయత్నించారు. తీవ్ర నిరసనల తర్వాత ఆ ప్రయత్నాలు విరమించుకున్నారు.' అన్నారు.

### ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

నిరుపేదలకు దశాబ్దాలుగా నిస్వార్థ సేవ చేస్తున్న సంస్థను కాపాడిన మంత్రి లోకేశ్‌కు పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిణామం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, ప్రజల ప్రయోజనాల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

# వైసీపీ హయాంలో 'పోలవరం'లో భారీ అక్రమాలు

## 'కాగ్' నివేదికతో లోక్‌సభలో విరుచుకుపడ్డ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



న్యూఢిల్లీ: రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు అమలులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన 2025కు సంబంధించిన భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలోని ముఖ్యాంశాలను సభ ముందు ఉంచారు.

లక్షల ఎకరాలకు సాగునీరు, కోట్లాది మందికి తాగునీరు అందించే కీలక ప్రాజెక్టు అయిన పోలవరానికి ప్రజలు, కేంద్ర ప్రభుత్వం నిరంతరం మద్దతు ఇచ్చింది అయినా 2019 నుంచి 2024 మధ్య జరిగిన అమలు లోపాల వల్ల ప్రాజెక్టు పురోగతికి తీవ్ర ఆటంకం కలిగిందని ఆయన పేర్కొన్నారు.

### ఎంపీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

కాగ్ నివేదిక 11వ పేజీలో 2019-21 నుంచి 2022-23 మధ్య పోలవరం నిధులను సుమారు 50% తగ్గించినట్టు ఉంది. 13వ పేజీలో కేంద్రం విడుదల చేసిన రూ.2,097 కోట్లు భూ సేకరణ, పునరావాసానికి ఉపయోగించకుండా 2022, 2023లో పెండింగులో ఉంచారు. 38, 39 పేజీల్లో ప్రధాన డ్యామ్ కాంట్రాక్ట్‌ను పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ అభ్యంతరాలను పట్టించుకోకుండా అకస్మాత్తుగా రద్దు చేసినట్టు ఉంది. దీనివల్ల డయాఫ్రంవాల్ వరదల సమయంలో బయటపడిపోయి దెబ్బతింది. 33, 34 పేజీల్లో తీవ్రమైన లోపాలు, 40వ పేజీలో టెండర్ ప్రక్రియను 21 రోజుల నుంచి 16 రోజులకు తగ్గించి నిబంధనలను ఉల్లంఘించినట్టు పేర్కొన్నారు.

ఈ నిర్ణయాల వల్ల ప్రాజెక్టు నిర్మాణం బలహీనపడటంతో పాటు పురోగతిలో ఆలస్యం జరిగింది. "ఇంత ముఖ్యమైన ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన విధానాలకు వ్యతిరేకంగా అన్ని నిర్ణయాలు తీసుకున్నారు" అని వ్యాఖ్యానించారు.

ప్రధాన డ్యామ్ కాంట్రాక్టును పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ అభ్యంతరాలున్నప్పటికీ రద్దు చేయడం వల్ల డయాఫ్రంవాల్ వరదలకు గురై దెబ్బతింది ఆయన ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ మద్దతు, రాష్ట్ర ప్రజల ఆశయాలు ఉన్నప్పటికీ... గత ప్రభుత్వ పరిపాలనా లోపాలు, తప్పుదోవ పట్టించిన కారణంగా ప్రాజెక్టు ముందుకు సాగలేకపోయిందని తేల్చి చెప్పారు.

### పన్నుల పరిపాలనపై ఎంపీ కొన్ని సూచనలు చేశారు

పెండింగ్ ట్యాక్స్ వివాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ వాటిని తగ్గించడానికి సంస్కరణలు అవసరమన్నారు. వ్యక్తులకు రూ.కోటి వరకు సరళమైన పన్ను విధానం, అప్పీల్ పరిమితులు పెంపు, కాలపరిమితి గల వివాద పరిష్కార విధానాలు, అవసరం లేని కేసులు వేస్తున్న అధికారులపై బాధ్యత విధించడం వంటి సూచనలు చేశారు.

అలాగే ఏఐ, సెమీకండక్టర్లు, ఆర్‌అండ్‌డీ వంటి కీలక రంగాల్లో నిధుల వినియోగం తక్కువగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 2028 నాటికి భారత్‌లో 10 లక్షల జీపీయూ మౌలిక వసతులను అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకోవాలని, కేటాయించిన నిధులను సమయానికి వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు.

కేవలం నిధుల కేటాయింపే కాకుండా వాటి సమర్థవంతమైన అమలు ద్వారా ఫలితాలు సాధించాలని ఎంపీ స్పష్టం చేశారు.

# పర్యాటకం..రాష్ట్ర ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజిన్

- సందర్శకులు పెరిగేలా వినూత్న నిర్ణయాలు
- గోదావరి పుష్కరాల్లోపే 'అఖండ గోదావరి'
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- సచివాలయంలో శాఖపై ముందస్తు సమీక్ష



అమరావతి(చైతన్యరథం): పర్యాటక రంగం ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి కీలకమైన 'గ్రోత్ ఇంజిన్'గా మారుతోందని, ఈ రంగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచిం చారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటక శాఖపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి దుర్గేష్ తన ఛాంబర్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా రాబోయే 15 ఏళ్లకు ఏపీటీడీసీ ఆర్థిక ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో సీఎంతో జరిగిన మీటింగ్ వివరాలు, దిశానిర్దేశం చేసిన అంశాలు, నూతన పెట్టుబడులు, హోటల్స్, హాస్పిటాలిటీ, ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన ప్రాజెక్టు వివరాలు, హోమ్‌స్టేల పురోగతి, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి, పర్యాటక ప్రాంతాలకు కల్పిస్తున్న ప్రచారంపై చర్చించారు. గోదావరి పుష్కరాల లోపే 'అఖండ గోదావరి' ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకుల సంఖ్యను పెంచేలా వినూత్న నిర్ణయాలు తీసుకోవాలని, బాధ్యతాయుత పర్యాటకానికి పెద్దపీట వేయాలని, క్రియేటివ్ ఎకానమీ డెవలప్‌మెంట్ దిశగా చర్యలుండాలని దిశానిర్దేశం చేశారు.

### మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రతినిధులు

సమీక్షకు ముందు ఇటీవల ముంబయిలో జరిగిన ఐఏఏపీఐ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్) ఎక్స్‌పో-2026 వేదికగా ఏపీ పర్యాటక శాఖ, మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో సంబంధిత ప్రతినిధులు రామ్‌ప్రకాష్ మహేశ్వరీ, అంకుర్ మహేశ్వరిలు మంత్రి దుర్గేష్‌ను ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారులతో కలిసి విశాఖ వీఎంఆర్డీఏ పరిధిలో దాదాపు రూ.100 కోట్లతో ఏర్పాటు చేయబోయే అత్యాధునిక అమ్యూజ్‌మెంట్ పార్క్, రిసార్ట్‌కు అనువై న స్థలాలు గుర్తించామని మంత్రికి వివరించారు. అనతికాలం లోనే తమకు పర్యాటక శాఖ అధికారులు అందించిన మార్గదర్శక త్వంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి వహించారని, త్వరితగతిన అనుమతులు మంజూరు చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధమని మంత్రి దుర్గేష్ వారికి భరోసానిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతృత్వంలోని 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'లో భాగంగా వినోద రంగాన్ని రాష్ట్ర పర్యాటక వృద్ధికి ప్రధాన చిహ్నాం గా మలిచే లక్ష్యంతో తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష లో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, పర్యాటక శాఖ ఈడీలు పద్మావతి, శేషగిరిరావు, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మా రాణి సీలా, ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ సత్యప్రభ, పర్యాటక శాఖ అధికారులు లెజ్వంతి, నాంచారయ్య, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ మిల్లుల ఆధునికీకరణకు చర్యలు

## *లోక్‌సభలో ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి విజ్ఞప్తి*



రాజమండ్రి (చైతన్యరథం): ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం పార్లమెంట్‌లో రూల్ 377 కింద అత్యవసర ప్రజా ప్రాధాన్యత గల అంశంగా ఆంధ్రప్రదేశ్‌లో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఆధునికీకరణ అవసరాన్ని మంగళవారం కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రం భారతదేశంలోనే అత్యధిక పామ్ ఆయిల్ సాగు విస్తీర్ణం కలిగిన రాష్ట్రంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.49 లక్షల హెక్టార్లలో పామ్ ఆయిల్ సాగు జరుగుతుండగా..ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 1.97 లక్షల మంది కష్టజీవి రైతులకు ఉపాధి కల్పిస్తోందన్నారు. పామ్ ఆయిల్ ఒక దీర్ఘకాలిక వాణిజ్య పంటగా దేశీయ ఉత్పత్తి పెంపు, దిగుమ తులపై ఆధారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్- ఆయిల్ పామ్ పథకం కింద విస్తృతంగా ప్రోత్సహిస్తోంది. ప్రతి సంవత్సరం భారతదేశం తినే నూనెల దిగుమతుల కోసం రూ.70,000 కోట్లకు పైగా వ్యయం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయ క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తి గరిష్ఠీకరణ జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని ఆమె పేర్కొన్నారు. ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో రైతుల ఆదాయాన్ని నేరుగా ప్రభావితం చేస్తుందని, కేవలం 1 శాతం ఓఈఆర్ తగ్గుదల వల్ల ప్రతి టన్ను తాజా పండ్ల గుత్తులపై సుమారు 10 కిలోల నూనె నష్టం సంభవిస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆర్థిక సహాయం అందించినప్పటికీ, అనేక సహకార, ప్రభుత్వ ఆధ్వర్యంలోని పామ్ ఆయిల్ మిల్లులు ఇప్పటికీ పాతబడిన బ్యాచ్ ప్రాసెసింగ్ యంత్రాలతో కొనసాగుతున్నాయని తెలిపారు. దీని వల్ల అనవసరంగా నూనె దిగుబడి నష్టాలు ఏర్పడుతూ రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో NMEO-OP పథకం కింద లక్ష్యిత ఆర్థిక, సాంకేతిక సహాయం అందించి ఆంధ్రప్రదేశ్‌లోని పాత పామాయిల్ మిల్లులను సమగ్రంగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాంకేతిక ఆధునికీకరణ చర్యల ద్వారా నూనె ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగడమే కాకుండా రైతుల జీవనోపాధి రక్షితమై, తినే నూనెల విషయంలో భారతదేశం స్వావలంబన దిశగా మరింత వేగంగా పురోగమిస్తుందని పేర్కొన్నారు.

# ఉగ్ర లింకు కేసులో నిందితులకు రిమాండ్

విజయవాడ(చైతన్యరథం): విజయవాడ ఉగ్ర లింకు కేసులో నిందితులు మహ్మద్ రెహ్మతుల్లా, మీర్జా సోహెల్, మహ్మద్ డానిష్లను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం ఏప్రిల్ 6 వరకు రిమాండ్ విధించింది. దీంతో వారిని విజయవాడ కేంద్ర కారాగారానికి తరలించారు. పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకుని సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ ముగ్గురినీ విజయ వాడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ సహా పలు సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలంవైపు ఆకర్షిస్తు న్నట్లు గుర్తించారు. ఉగ్రవాద రిక్రూట్మెంట్, జిహాదీ కార్యకలాపాల కోసం అవసరమైన నిధులను వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్లు సమ కూరుస్తున్నట్లు నిఘావర్గాలకు సమాచారం ఉంది. ఏపీలోనే కాకుం డా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులతో వీరు గ్రూప్లను ఏర్పాటు చేసి.. అందులో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ వారు ఉగ్రదాడుల కోసం సన్నద్ధమయ్యేలా పురిగొల్పుతున్నట్లు విచారణలో తేలింది.

చైతన్యరథం

## సైబర్ నేరగాళ్లపై కేంద్రం ఉక్కుపాదం

***చిత్తూరు ఎంపీ ప్రసాదరావు ప్రశ్నకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి లిఖితపూర్వక సమాధానం***



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. సైబర్ భద్రతపై మంగళవారం లోక్‌సభలో ఆయన అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**14C, సైబర్ దోస్త్ ద్వారా అప్రమత్తత:**

భారత సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ 14C ద్వారా దేశవ్యాప్తంగా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. 'సైబర్ దోస్త్' కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైబర్ నేరాల నివారణలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు వెల్లడించింది. ముఖ్యంగా రాష్ట్రానికి సైబర్ భద్రత విషయంలో అవసరమైన పూర్తి సాంకేతిక సహకారాన్ని కేంద్రం అందిస్తోందని ఎంపీ ప్రసాదరావు వివరించారు.

గత ఐదేళ్లలో దేశంలో నమోదైన సైబర్ సంఘటనల వివరాలను కేంద్రం వెల్లడించింది:

2021: 14,02,809
2022: 13,91,457
2023: 15,92,917
2024: 20,41,360
2025: 29,44,248

మొత్తంగా ఐదేళ్లలో సుమారు 93లక్షలకు పైగా సైబర్ ఘటనలు చోటుచేసుకోగా... అత్యధికంగా దేశ రాజధాని ఢిల్లీ నుంచే ఫిర్యాదులు అందినట్టు ప్రభుత్వం పేర్కొంది.

**కేంద్రం తీసుకున్న కీలక చర్యలు:**

సైబర్ ఆర్థిక నేరాలకు గురైన వారు తక్షణం ఫిర్యాదు చేసేందుకు 1930 నెంబరును అందుబాటులోకి తెచ్చారు.

Cybercrime.gov.in: బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక పోర్టల్.

సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, డిజిటల్ ఫోరెన్సిక్స్ అంశాలపై పోలీసు బలగాలకు ప్రత్యేక శిక్షణ.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 ప్రకారం సైబర్ దాడులకు తక్షణం స్పందించేందుకు నేషనల్ ఏజెన్సీగా CERT-In పనిచేస్తోంది.

'సైబర్ నేరాల నియంత్రణకు, బాధితులకు త్వరితగతిన న్యాయం చేసేందుకు రాష్ట్రాలతో కలిసి కేంద్రం పనిచేస్తోంది. అవసరమైన నిధులు, సాంకేతిక మద్దతు అందిస్తోందని కేంద్ర సహాయ మంత్రి తన సమాధానంలో స్పష్టం చేశారు' అని ఎంపీ ప్రసాదరావు మీడియాకు వివరించారు.

## నిరుద్యోగుల భరోసా 'జాబ్ క్యాలెండర్'

***చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ***




నర్సీపట్నం (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంపై నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో నర్సీపట్నం 5 రోడ్ జంక్షన్ గ్రంథాలయం నుంచి అభి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నిరుద్యోగులు 'థ్యాంక్యూ నారా లోకేష్ సార్' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నిరుద్యోగుల కష్టాలను స్వయంగా చూసిన లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం చారిత్రక ఘట్టమని కొనియాడారు. ఈ ఏడాదిలోనే ఈ ఖాళీలను భర్తీ చేసి వచ్చే ఉగాదికి మరో కొత్త క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించడం నిరుద్యోగుల భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ నియామకాలను చేపడుతూనే..మరోవైపు గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి రప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి అభినందనీయమని ప్రశంసించారు. అభ్యర్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పల నాయుడు, జడ్పీటీసీ సుకల రమణమ్మ, జిల్లా అధికార ప్రతినిధి లాలం శ్రీరంగస్వామి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి లాలం మురళీ, దనిమిరెడ్డి మధు, పైల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో మున్సిపల్ మంత్రి నారాయణ భేటీ

అమరావతి(చైతన్యరథం): సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమా వేశమయ్యారు. ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పీయూష్ కుమార్, సింగపూర్ అధికారులు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా పలువురు ఏపీ మంత్రులకు అడ్మినిస్ట్రేషన్, గవర్నెన్స్‌పై ట్రెనింగ్ సింగపూర్ ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సింగపూర్ బృందానికి మంత్రి నారాయణ వివరించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విజన్ 2047 లక్ష్యంగా మున్సిపల్ శాఖ చేపట్టిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను వివరించారు. ఆయా శాఖలకు సింగపూర్‌లో అమలుచేస్తున్న ఉత్తమ పద్ధతులపై ఏపీ మంత్రులకు శిక్షణ ఇవ్వనున్నారు.

**భవన నిర్మాణాలు, లే అవుట్‌ల అనుమతులపై ఫోకస్**

భవన నిర్మాణాలు, లే అవుట్‌ల అనుమతులను మరింత సులభతరం చేయడంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. సచివాల యంలో నరెడ్కో, క్రెడాయ్ ప్రతినిధులతో పురపాలక మంత్రి నారాయణ సమావేశమయ్యారు. సమావేశానికి హాజరైన టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనలు పలుమార్లు సడలించింది. తాజాగా ఆయా సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకున్నారు. మరోసారి సమావేశం తర్వాత నిబంధనల్లో మార్పుపై తుది నిర్ణయం తీసుకోనుంది.



**గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌పై సమీక్ష**

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌పై మంత్రి నారాయణ సమీక్షించారు. ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నసీర్, గల్లా మాధవి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, జీఎంసీ కమిషనర్ మయూరి అశోక్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. జీఎంసీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. నగరంలో రోడ్ల అభివృద్ధి, డ్రైన్ల నిర్మాణం, టిడ్కో ఇళ్ల పరిస్థితిపై ప్రధానంగా చర్చ సాగింది. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అధికారులు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. భవన, లే అవుట్ అనుమతుల దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ల త్వరగా క్లియర్ చేయా లని అధికారులను ఆదేశించారు.

# లోకేష్ చొరవతో ఆర్డీటీ సేవల పునరుద్ధరణ

- **గత వైసీపీ ప్రభుత్వంలో సంస్థను ఇబ్బంది పెట్టారు**
- **దాని భూములు కూడా కబ్జా చేయాలని చూశారు**
- **బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



మంగళగిరి (చైతన్యరథం): రాయలసీమ గడ్డపై సేవ అనే పదానికి మారుపేరు ఆర్డీటీ సంస్థ. గత 50 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఈ సంస్థ ఒక ఆపద్బాంధవిలా నిలుస్తోందని బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. స్పెయిన్ నుంచి వచ్చిన విన్సెంట్ ఫెర్రర్, ఆన్ ఫెర్రర్ దంపతులు ఇక్కడి వెనుకబడిన ప్రాంతాల ను చూసి చలించి మన ప్రజల కోసం విద్య, వైద్యం, క్రీడలు, వ్యవసాయం, గృహనిర్మాణ రంగాల్లో వారు అనేక సేవలు చేశారని గుర్తుచేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడి యా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ వంటి సేవా సంస్థను కూడా రాజకీయ కక్షతో వేధించింది. విదేశీ నిధుల రెన్యూవల్ విషయంలో కావాలని ఇబ్బందులు పెట్టి, సంస్థ సేవలు ఆగిపోయేలా కుట్రలు చేసింది. ఆ సంస్థకు ఉన్న భూములను కబ్జా చేయాలని చూశారు. 2021, జూన్ 15న అనంతపురం నగరం శివార్లలోని రుద్రంపేట (సర్వే నెం.106) లో ఉన్న సుమారు 4.20 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని గత ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ సమయంలో ఆర్డీటీ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవాల్సి వచ్చింది. అప్పుడు ప్రతి పక్షంలో ఉన్న మేము వారికి పూర్తి అండగా నిలబడ్డాం. లోకేష్ తన యువగళం పాదయాత్రలో ఈ అన్యాయాన్ని స్వయంగా చూశారు. ఆ రోజే ఆయన మాట ఇచ్చారు. మన ప్రభుత్వం వచ్చాక ఆర్డీటీ ఆస్తులను కాపాడతాం. సంస్థకు అడ్డుగా ఉన్న సమస్యలను తొలగిస్తామని చెప్పారు. ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ నిలబెట్టుకున్నారు. ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో మాట్లాడి ఆగిపోయిన రెన్యూవల్ ప్రక్రియను పూర్తి చేయించి సంస్థకు మళ్లీ పూర్వవైభవం తెచ్చారు. ఆర్డీటీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వల్ల ఈరోజు మన జిల్లా ప్రజలు అత్యవసర చికిత్స కోసం బెంగళూరు, హైదరాబాద్‌కో వెళ్లాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా గర్భిణులకు ఈ ఆసుపత్రి ఒక వరం. వేలాది మంది పేద బిడ్డలను చదివించి ప్రయోజకులను చేయడమే కాకుండా, క్రీడల్లో మన జిల్లా బిడ్డలు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతోంది. ఆధునిక పనిముట్లు అందిస్తూ రైతులకు తోడు గా నిలవడమే కాకుండా వేలాది మందికి పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ఎన్నికల సమయంలో మేము చెప్పిన విధంగానే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్డీటీ సంస్థను అన్ని విధాలా ఆదుకోవడం చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబు, నారా లోకేష్‌కు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల తరపున మంత్రి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

# అప్పన్న చందనోత్సవంలో భక్తులకు పెద్దపీట

- **మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి**
- **ఏర్పాట్లపై ఎమ్మెల్యేలతో కలిసి సమీక్ష**
- **అప్రమత్తంగా వ్యవహరించాలని దిశానిర్దేశం**

విశాఖపట్టణం(చైతన్యరథం): సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ సింహాచలం చందనోత్సవ వేడుకలను నిర్వహించాలని, ఆ దిశగా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని చిన్నపాటి తప్పిదం కూడా జరగకుండా సమష్టి కృషి చేసి వేడుకను విజయవంతం చేసేందు కు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏప్రిల్ 20న జరిగే వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవ వేడుక నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశపు హాలులో స్థానిక ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకు మార్ రాజు, గంటా శ్రీనివాసరావు (వర్చ్యువల్), జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, ఈవో వెంకట రావు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ టిక్కెట్ల జారీ ప్రక్రియలో, ఏర్పాట్ల విషయంలో ఎక్కడా ఎలాంటి లోపాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏప్రిల్ 17వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచిం చారు. ఈ లోపు ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్త క్షేత్రస్థాయి పర్యటన చేసి ఏర్పాట్లను సమీక్షించుకోవాలని చెప్పా రు. ఎక్కడైనా గ్యాప్ ఉంటే సరి చేసుకోవాలన్నారు. వెహికల్ పాసులు, డ్యూటీ పాసుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ప్రయత్న లోపం లేకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, చందనోత్సవ వేడుకను విజయవంతంగా జరిపించాలని మంత్రి పిలుపునిచ్చారు.



**విశాఖలో ట్రాన్స్‌జెండర్స్‌కి ఆటోలు పంపిణీ**

విశాఖలో స్వామి ట్రాన్స్‌జెండర్స్‌కి ఆటోలు పంపిణీ చేశారు. స్వయం ఉపాధి కోసం సబ్సిడీతో వాటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో గౌరవంగా జీవించాలన్న ఉద్దేశంతో వారికి ఉపాధి కల్పిస్తున్నాం. విశాఖలో 20మంది ట్రాన్స్ జెండర్స్‌ని కేజీహెచ్ శానిటేషన్ సూపర్‌వైజర్లుగా నియమించాం. మరి కొంతమందిని గుర్తించి ఉపాధి కల్పిస్తాం. ట్రాన్స్ జెండర్స్‌కి గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. సింగిల్ రేషన్ కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ట్రాన్స్ జెండర్స్ స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు ప్రోత్సాహి స్తున్నామని తెలిపారు. ట్రాన్స్ జెండర్స్‌కి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. ట్రాన్స్ జెండర్స్ అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త

- ఎంఎస్ఎంఈ బ్యాంకు రుణాలు డబుల్ చేశాం
- రాయితీలతో పథకాలు ఉపయోగించుకోవాలి
- ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు
- పల్నాడు జిల్లా తాళ్లూరులో అవగాహన సదస్సు



అమరావతి(చైతన్యరథం): ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం తోనే ఎంఎస్ఎంఈ పనిచేస్తోందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికా రత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75 తాళ్లూరులో ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ద్వారా అనేక పథకాలు రాయితీలతో గ్రామాల్లో అమలు అవుతు న్నాయని.. వీటిని యువత సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఎదగాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేష న్ ప్రోగ్రామ్ ద్వారా 35 % రాయితీలతో అమలయ్యే పథకాలను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. రూ.300 కోట్లతో సీఎంఈపీ పథకం అమలవుతోందని తెలిపారు. ఎంఎస్ఎంఈ ద్వారా బ్యాంకులు అందించే రుణాలను డబుల్ చేస్తున్నట్టు తెలిపా రు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫిషరీస్ యూనిట్ల ఏర్పాటుకు కూడా రాయితీలతో రుణాలు ఇస్తున్నామన్నారు. ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది డ్వాక్రా సభ్యులతో పారిశ్రామిక/సేవా/ వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయ డం జరిగింది. వచ్చే సంవత్సరంలో 5 లక్షల మంది డ్వాక్రా సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయటం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. పెద్ద పరిశ్రమల్లో కోటి పెట్టుబడి పెడితే ఒకరికే ఉపాధి అని.. చిన్న పరిశ్రమల్లో కోటితో 10 మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రతి మండలంలో రూ.3 – 4 కోట్లతో చిన్న తరహా పరిశ్రమలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తు న్నామని తెలిపారు. 1995లో జన్మభూమితో గ్రామాలను చంద్రబాబు ఎలా అభివృద్ధి చేశారో... ఇప్పుడు గ్రామాల్లోనూ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో గ్రామాలను కూడా పారిశ్రామికంగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు.

**గారపాడులో ఎంఎస్ఎంఈ ప్రాజెక్ట్**

కలెక్టర్ కృత్తికా శుక్లా మాట్లాడుతూ పెదకూరపాడు నియోజక వర్గంలోని గారపాడులో ఎంఎస్ఎంఈ ప్రాజెక్ట్ కోసం 50 ఎకరాలు సేకరించామని.. ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పిం చి వచ్చే ఆరు నెలల్లో దీనిని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గంలోనూ 30 ఎకరాలు ఈ ప్రాజెక్ట్ కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తుల స్టాల్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మారెడ్డితో పాటు ఎంఎస్ఎంఈ సీఈవో విశ్వ మనోహర్, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్ పాల్గొన్నారు.

# రాజధానిలో అగ్ని ప్రమాదాలపై విచారణ

**హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశం**



అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిలో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై విచారణకు ఆదేశించినట్లు ఏపీ హోంమంత్రి అనిత తెలిపారు. సోమవారం అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమకు భూమి పూజ ఘనంగా జరిగిం దని.. దాన్ని ఓర్వలేక రాజధానిలో పైపులకు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. గతంలో రాజధాని అమ రావతి నిర్మాణం ఓర్వలేక అరటితోటకు నిప్పు పెట్టిన ఉదాహర ణలు ఉన్నాయని తెలిపారు. పోలీసుశాఖ అన్ని కోణాల్లో విచారణ చేస్తోందని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిపై ఎవరు కుట్రలు పన్నినా ఉపేక్షించేది లేదని అనిత హెచ్చరించారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో రాయపూడి సమీపం లో రాజధాని నిర్మాణ పనులు చేస్తున్న మేఘా ఇంజినీరింగ్ కంపెనీ నిల్వ చేసిన పైపులకు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు ఎగసిపడిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై స్థానికులు, కంపెనీ సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. ఐదు అగ్నిమాపక శకటాలతో పాటు పోలీసు సిబ్బంది మంటలను అదుపు చేశారు. దట్టమైన పొగతో మంటలు ఎగసిపడటంతో అదుపు చేయటం కష్టంగా మారింది. కొద్దిరోజుల కిందటే వెలగ పూడి సమీపంలో ఎల్అండ్ కంపెనీకి చెందిన రూ.కోట్ల విలువైన హెచ్‌డీపీఈ పైపులు ఇదే తరహాలో మంటల్లో బుగ్గి అయ్యాయి.

# ఆర్డీటీ సేవలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**తెలుగు రాష్ట్రాలకు శుభవార్త**




అమరావతి(చైతన్యరథం): తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) కార్యకలాపాలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఆర్డీటీ సేవలు ఆగిపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యు లేషన్ యాక్ట్ ప్రకారం ఆర్డీటీకి అవసరమైన అనుమతులు మంజూ రయ్యాయి. దీంతో సంస్థకు ఎదురైన పరిపాలనా అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్డీటీ డైరెక్టర్ మంచో ఫెర్రర్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో అందుతున్న సేవలు వెలకట్టలేనివి. అనంతపురం జిల్లాతో పాటు యావత్ రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ లభించడం ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది. అనంతపురం జిల్లా సామా జిక, ఆర్థిక చిత్రపటాన్ని మార్చేసిన ఆర్డీటీ సంస్థకు ఉన్న అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. విదేశీ నిధుల సేకరణకు అవసరమైన ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం మార్చి 22, 2031 వరకు పొడిగిస్తూ అధికారికంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.

**ముఖ్యమంత్రి చొరవ**

సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాయలసీమతో పాటూ వెనుకబ డిన ప్రాంతాల అభివృద్ధికి ఆర్డీటీ ఎంత అవసరమో వివరించారు. నిలిచిపోతాయ నుకున్న అనేక సంక్షేమ పథకాలు ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో కొనసాగనున్నాయి.

**మంత్రి నారా లోకేశ్ దౌత్యం**

ఈ లైసెన్స్ పునరుద్ధరణ వెనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కృషి అనితరసాధ్యమైనది. ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా ఢిల్లీకి వెళ్లి, కేంద్ర హోం శాఖాధికారులు, మంత్రులతో భేటీ అయ్యారు. ఆర్డీటీ దశాబ్దాలుగా చేస్తున్న నిరుప మాన సేవలను వారికి వివరించి, సాంకేతిక ఇబ్బందులను తొలగించేలా ఒప్పించారు.

# పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

విజయనగరం(చైతన్యరథం): విజయనగరం రెల్లివీధికి చెందిన పి.ప్రేమ్‌కుమార్ అనే యువకుడికి పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. రెల్లివీధికి చెందిన ప్రేమ్‌కుమార్ అనే యువకుడు కొన్నేళ్ల కిందట ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని పలు రకాలుగా వేధించాడు. దీంతో పెద్దలు అప్పట్లో బాలికను ప్రేమ్‌కుమార్‌కు ఇచ్చి చర్చిలో పెళ్లి చేశారు. అయితే పెళ్లి అనం తరం ప్రేమ్‌కుమార్ అన్నదమ్ములు బాలికను అసభ్యకరంగా తాకటం, స్నానం చేస్తుండగా తొంగిచూడటం వంటి పనులు చేసేవారు. కొన్నాళ్లకు ఆ బాలిక గర్భం దాల్చింది. అలాగే అత్త మామలతో పాటు ప్రేమ్‌కుమార్ సోదరులు, కుటుంబసభ్యులు అదనపు కట్నం తెమ్మనటమే కాకుండా శారీరకంగా, మానసికంగా హింసించటంతో బాలిక.. మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2025 జనవ రిలో ఫిర్యాదు చేసింది. వాదోపవాదాల అనంతరం న్యాయాధికారి కె.నాగమణి సోమవారం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడిం చారు. నిందితులుగా చేర్చిన ఆరుగురికి ఏడాదిపాటు కఠిన కారాగార శిక్షతో పాటు, రూ.5 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు తీర్పు వెలువరించారు.

## కేజీహెచ్‌లో సీటీవీఎస్ సేవలతో ప్రాణాధారం

- త్వరలో క్యాథ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- హార్ట్ లంగ్ మిషన్, హీమోథర్మ్ ప్రారంభం



విశాఖపట్నం (చైతన్యరథం): కింగ్ జార్జి ఆసుపత్రిలో కార్డియో థొరాసిక్/వాస్క్యులర్ సర్జరీ (సీటీవీఎస్) విభాగం ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రాణాధారంగా నిలుస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. కార్డియాలజీ విభాగంలో ఐసీఐసీఐ బ్యాంకు ఫౌండేషన్ అందించిన సమారు రూ.2 కోట్ల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన హార్ట్ లంగ్ మిషన్, హీమోథర్మ్‌ను మంగళవారం సాయంత్రం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రా మెడికల్ కాలేజీలో కార్డియాలజీ విభాగం 1995--98 కాలంలో ప్రారంభమై, 2000కు ముందే ఓపెన్ హార్ట్ సర్జరీలు ప్రారంభ మవడం గొప్ప చారిత్రాత్మక అంశమని గుర్తుచేశారు. అయితే హార్ట్ లంగ్ మెషిన్ పాడైపోవడంతో కొంతకాలం ఇబ్బందులు ఎదురైన ప్పటికీ స్థానిక ఎమ్మెల్యే వంశీ ద్వారా సమస్య తమ దృష్టికి వచ్చిం దన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సానుకూలంగా స్పందించి ఐసీఐసీఐ బ్యాంకు వారిని సంప్రదించగా సీఎస్ఆర్ నిధులతో హార్ట్ లంగ్ మెషిన్‌ను విరాళంగా అందజేయడం అభినం దనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్డియాలజీ విభాగంలో రెగ్యులర్‌గా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. క్యాథ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్‌ను కూడా సీఎస్సార్ ద్వారా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో బైపాస్ సర్జరీలు విజయ వంతంగా నిర్వహిస్తున్నారని, అవసరమైతే గుండె మార్పిడి శస్త్రచికి త్సలు చేసే సదుపాయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఐసీఐసీఐ బ్యాంకు ఫౌండేషన్ ప్రతి నిధులు శివకుమార్ చిట్టిపోలు, శ్రీవర్ధన్ బోబెపల్లి, పక్కి వెంకట సాయి శంకర్, ఎం.రజనీకాంత్‌రెడ్డి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, సూపరింటెండెంట్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో కీలక విభాగాలకు ఇన్‌చార్జులు

అమరావతి (చైతన్యరథం): ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో నాలుగు ముఖ్య విభాగాల కు ఇన్‌చార్జులను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మెడికల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా సౌరభ్ గౌరవ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే.. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్‌గా వీరపాండియన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈఓగా కేవీఎన్.చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక ఆయుష్ విభాగం డైరెక్టర్‌గా రోణంకి గోపాలకృష్ణకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిం చింది. అంతకముందు ఆయుష్ డైరెక్టర్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవో బాధ్యతలు చూస్తున్న దినేశ్ కుమార్‌ను ప్రభుత్వం ఇటీవల పోలవరం కలెక్టర్‌గా బదిలీ చేయడంతో ఈ విభాగం ఖాళీ అయిన సంగతి తెలిసిందే. వైద్యారోగ్య శాఖ కార్యదర్శిగా, ఔషధ నియం త్రణ పరిపాలన విభాగం డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తున్న సౌరభ్ గౌరవ్‌ను సైతం తమిళనాడు ఎన్నికల విధులకు వేశారు. అయితే కీలక శాఖ పరిస్థితి వివరించడంతో ఆయనకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపునిచ్చారు.

చైతన్యరథం

# ద్రోణి ప్రభావం.. రాష్ట్రంలో వర్ష సూచనలు

- పలు జిల్లాల్లో పిడుగులు పడొచ్చు
- అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరిక



అమరావతి(చైతన్యరథం): ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూ రి సీతారామరాజు, తూర్పుగోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులు పడొచ్చని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చని పేర్కొంది. రాబోయే అయిదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని అంచనా వేస్తోంది.

# గడువులోగా పోలవరం, వెలిగొండ

- వారం వారం పురోగతిపై నివేదిక ఇవ్వాలి
- ఇరిగేషన్ సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి(చైతన్యరథం): అత్యంత కీలకమైన ఇరిగేషన్ రంగానికి సంబంధించి పనులు శరవేగంతో పూర్తి చేసి ఫలితా లు ప్రజలకు అందివ్వాలని కూటమి ప్రభుత్వం కృత నిశ్చయం తో పనిచేస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు చెప్పారు. అందులో భాగంగానే ప్రతి పనికి, ప్రతి ప్రాజెక్టుకి గడువు నిర్దేశించుకుని ఆ లోపు పూర్తి చేయాలని లక్ష్యాలు విధించామన్నారు. అధికార యంత్రాంగం, ఇంజనీ రింగ్ నిపుణులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు బాధ్యతతో ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.

మంగళవారం ఆయన వెలిగొండ ప్రాజెక్ట్, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై ఇరిగేషన్ శాఖ అధికారులతో, ఏజెన్సీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్ లైనింగ్ పనుల విషయంలో టైం షెడ్యూల్‌కి అనుగుణంగా పనులు జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వారం సమీక్ష జరుపుతుంటే ఎప్పటికప్పుడు మెరుగుపరచు కుంటాం అనడంలో అర్థం లేదన్నారు. జాప్యానికి కారకులైన వారు అమరావతి వచ్చి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇలా అయితే ఎలా అని ప్రశ్నించారు. వెలిగొండ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై అధికారులను గణాంకాలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం, హంద్రీ నీవా ప్రాజెక్టుల తర్వాత అధిక ప్రాధాన్యత పోలవరం ఎడమ ప్రధాన కాలువ, వెలిగొండ ప్రాజెక్టులదే అని చెప్పారు. సీజన్ మొదలయ్యే లోగా గోదావరి జలాలను అనకాపల్లి వరకు తీసుకెళ్లేలా పోలవరం ఎడమ ప్రధానకాలువ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హైవేల క్రాసింగ్‌ల దగ్గర వంతెనల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వారం, వారం వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై రిపోర్టు ముఖ్య మంత్రి చంద్రబాబుకి ఇవ్వాలని గుర్తు చేశారు. త్వరలోనే నిర్వా సితులకు పునరావాస పరిహారం అందించేలా చర్యలు చేపట్టామ ని చెప్పారు. జూన్ నాటికి నల్లమల సాగర్‌ను నింపేలా వెలి గొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వర రావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వడ్డీ ఆశ చూపి రూ.47 లక్షలు దోపిడీ

- లక్షకు పదివేల వడ్డీ అంటూ ఆశ చూపి రూ.47 లక్షలు దోపిడీ చేశారు
- 16 గజాల ఇంటి స్థలం కబ్జా... అడిగితే చంపేస్తామంటూ దౌర్జన్యం
- పట్టాదారు పుస్తకాల మాయాజాలం... అన్ రిజిస్టర్ డాక్యుమెంట్లతో భూ కబ్జా
- అర్జీలు స్వీకరించిన బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప
- సమస్యల పరిష్కారానికి కృషి



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

గుంటూరుకు చెందిన సుభానీ, మురళీకృష్ణ, నాగజ్యోతి అర్జీలో... అన్నం వెంకట పూర్ణచంద్రరావు, పెరికల రాణి, షేక్ ఆశా, అనిల్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు అనే వ్యక్తులు ఒక పథకం ప్రకారం మమ్మల్ని నమ్మించారు. వ్యాపార పెట్టుబడి పేరుతో ప్రజల నుంచి సుమారు రూ.200 కోట్లకు పైగా వసూలు చేశారు. ప్రతి లక్ష రూపాయల పెట్టుబడికి నెలకు రూ.10వేలు చొప్పున 20 నెలల పాటు ఇస్తామని, బంగారం, వెండి స్కీమ్‌ల ద్వారా భారీ లాభాలు వస్తాయని ఆశ చూపారు. సాక్ష్యంగా చెక్కులు, బాండ్లు కూడా ఇచ్చారు. ఇతరులను చేర్పిస్తే గ్రాము బంగారం, లక్షకు వెయ్యి రూపాయల కమిషన్ ఇస్తామని చెప్పారు. దీంతో మేము బంధువులు, స్నేహితుల దగ్గర సేకరిం చిన మొత్తం రూ.47 లక్షలను ఫోన్‌పే, గూగుల్‌పే, నగదు రూపంలో వారికి చెల్లించాము. చాలా మంది పొలాలు అమ్మి, అప్పులు చేసి, బంగారాన్ని తాకట్టు పెట్టి మరీ సొమ్మును వారికి అప్పగించాం. గత రెండు నెలలుగా "బ్యాంకు అకౌంట్లు సీజ్ అయ్యాయి" అనే సాకుతో నెలవారీ డబ్బులు ఆపేశారు. ప్రస్తుతం ఆ కంపెనీలను మూసివేసి నిర్వాహకులందరూ పరారీలో ఉన్నారు. మేము డబ్బు గురించి అడగడానికి వెళ్తే అక్కడ ఉన్న కొంతమంది వ్యక్తులు మాపై దౌర్జన్యం చేసి చంపేస్తామని బెదిరిస్తున్నారు. వారి నుంచి మాకు ప్రాణహాని ఉంది.

పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన సీతారామయ్య విజ్ఞప్తి... నాకు 203 చదరపు గజాల ఇంటి స్థలం ఉంది. నేను ఊళ్లో లేనప్పుడు పొరుగున ఉన్న తులువ నాగేశ్వరరావు కుమారులు రామాంజయ్య, శ్రీను, వెంకట్రావు, కోటయ్య సుమారు 16 గజాల స్థలాన్ని ఆక్రమించి గోడ నిర్మించారు. స్థలం తగ్గుతోందని నిలదీయగా వారితో పాటు వారి కుమారులు శ్రీకాంత్, అజయ్, నరసింహారావు, నరేంద్ర మా ఇంటికి వచ్చి బెదిరించారు. "పెద్ద మనుషుల దగ్గర కొనుక్కున్నాం, ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ఈ విషయమై గతంలో క్రోసూరు ఎస్ఐ ఫిర్యాదు చేయగా ఆక్రమణ నిజమేనని గుర్తించి గోడ తొలగిస్తామని హామీ ఇచ్చారు. 14 నెలలు గడుస్తున్నా నేటికీ ఆ గోడను తొలగించలేదు.

అన్నమయ్య జిల్లా పుంగనూరు మండలం గాలిమిట్ట పెద్దతండా గ్రామానికి చెందిన ప్రసాద్ అర్జీ... సర్వే నెం.476/4 లోని 1.00 ఎకరా భూమి దివంగత దావూజీ నాయక్ కుటుంబం ఆధీనంలో గత వంద ఏళ్లుగా ఉంది. దీనిపై వారు 2015 నుంచీ పోరాడుతున్నారు. గతంలో ఉన్న తహసీల్దారు టి.సీతారాం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆ భూమి దావూజీనాయక్ కుటుంబానిదేనని నిర్ధారిస్తూ ఎండార్స్‌మెంట్ కూడా ఇచ్చారు. ప్రస్తుత తహసీల్దారు రాము, వీఆర్వో జోష్ణ, ఆర్ఐ పవన్‌కుమార్ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా సీక్రెట్‌గా అవతలి వ్యక్తి శ్రీనివాసరావునాయక్‌తో కుమ్మక్కై పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. అన్ రిజిస్టర్ డాక్యుమెంట్లతో 1బి, అడంగల్ రికార్డులను సృష్టించి, సర్వే నెంబర్లను 476/40గా మార్చి అక్రమాలకు పాల్పడ్డారు. దీనిపై నిలదీస్తే "ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. గ్రామంలో సుమారు 100 ఎకరాలకు పైగా ఇలాగే 'మిస్ మ్యాచ్' రిజిస్ట్రేషన్లు జరిగాయి. అధికారుల తీరుతో ఊళ్లో ప్రజలు ఒకరినొకరు నరుక్కునే పరిస్థితి వస్తోంది.

మార్కాపురం జిల్లా కనిగిరికి చెందిన గుమ్మల్ల చెన్నలక్ష్మి వినతి ఇదీ... 1-8-2022న షేక్ పాషా హుస్సేన్ అనే వ్యక్తి నుంచి కనిగిరి సర్వే నెం.465లో గల 160 చదరపు గజాల స్థలాన్ని రూ.3లక్షలు చెల్లించి కొనుగోలు చేశాను. దీనికి సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది. ఆ తర్వాత సదరు స్థలం నాదేనంటూ గోపవరపు తిరుపతమ్మ అభ్యంతరం వ్యక్తం చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అమ్మిన వ్యక్తికి ఆ స్థలంపై పూర్తి హక్కులు లేవు. మోసపోయానని గ్రహించి నా డబ్బులు తిరిగి ఇవ్వాలని విక్రేత హుస్సేన్, అతని కుమారుడు షేక్ మౌలాలిని కోరాను. మొదట డబ్బులు ఇస్తామని ఒప్పందం చేసుకున్నప్పటికీ ఇప్పుడు డబ్బులు అడిగితే "నిన్ను చంపేస్తాం" అంటూ బహిరంగంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు.

ఏలూరుకు చెందిన సురేష్ సమస్య... సర్వే నెం.141లో మొత్తం 7.27 ఎకరాల భూమి ఉంది. గతంలో దీనిని 141/1, 141/2 గా సబ్ డివిజన్ చేశారు. సర్వే నెం. 141/2లో స్వామీజీ పేరున 3.63 ఎకరాలు ఉన్నట్టు రికార్డుల్లో ఉంది. అందులో 2.08 ఎకరాలను స్వామీజీ గతంలో విక్రయించగా ప్రస్తుతం ఆశ్రమం ఆధీనంలో 1.55 ఎకరాల భూమి మాత్రమే మిగిలి ఉంది. దీనిని ఆశ్రమం పేరు మీద ప్రత్యేకంగా సబ్ డివిజన్ చేయాలని ఏలూరు తహసీల్దారుకు దరఖాస్తు చేసుకోగా ఆయన సానుకూలంగా స్పందించి ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ డివిజన్ రికార్డులను పరిశీలన నిమిత్తం ఆర్డీవో కార్యాలయానికి పంపగా అక్కడ సాంకేతిక కారణాలతో ఫైల్ ఆగిపోయింది. గతంలోనే సబ్ డివిజన్ జరిగిందని, ఇప్పుడు మళ్లీ చేయడం కుదరదని చెప్తూ తహసీల్దారు నుంచి క్యాన్సిలేషన్ లెటర్ తీసుకురావాలని కోరారు. తీరా ఆ లెటర్ సమర్పించిన తర్వాత కూడా సబ్ డివిజన్ చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారు.

గుంటూరు జిల్లా వెంగళాయపాలేనికి చెందిన శివరామకృష్ణ అర్జీ... మా గ్రామంలో 1984లో సర్వే నెం.1239/2, 1239/3 లో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. 2019లో అప్పటి కలెక్టర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కోసం ఈ పట్టా భూములను పొరపాటున 'వాగు/పోరంబోకు'గా రికార్డుల్లో నమోదు చేసి రిజిస్ట్రేషన్లు కాకుండా నిషేధిత జాబితాలో పెట్టారు. 1928 నుంచి 1944 వరకు ఉన్న రికార్డుల ప్రకారం ఇది స్పష్టమైన పట్టా భూమి. 1901 నాటి విలేజ్ మ్యాప్, 1984 నుంచి జరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ఎక్కడా 'వాగు' ప్రస్తావన లేదు. 2021 నాటి సీఆర్డీఏ మ్యాప్, 2010-2025 వరకు ఉన్న శాటిలైట్ మ్యాప్‌లో కూడా ఇది నివాస స్థలంగానే ఉంది. తాజాగా 9-2-2026న రెవెన్యూ అధికారులు ఇచ్చిన రిపోర్టులోనే 0.80 సెంట్లలో ప్లాట్లు ఉన్నాయని, 0.66 సెంట్లలో సాగు జరుగుతోందని అంగీకరించారు. కేవలం 0.23 సెంట్లు మాత్రమే కాల్వ కింద ఉందని పేర్కొన్నారు. 1984 నుంచి మా స్వాధీనంలో ఉన్న భూమిని ఒక్కసారిగా వాగుగా మార్చడం వెనుక అంతర్యమేమిటి? నోటీసు ఇవ్వకుండా మా గోడలను కూల్చడం ఏ రకమైన న్యాయం? దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు.

వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం కనంపల్లి గ్రామానికి చెందిన రాగిరి సుబ్బరాయుడు విన్నపం... మా గ్రామంలోని సర్వే నెం.144లో గల ఐదు ఎకరాల భూమిని నమ్ముకుని మా కుటుంబ సభ్యులు ఐదుగురు జీవనం సాగిస్తున్నాం. 1956 నుంచి నేటి వరకు ఈ భూమిని బుట్టలు అల్లడం, కూలీ పనులు చేసుకునే మా కుటుంబాలే సాగు చేస్తున్నాయి. పలుమార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా, అర్జీలు పెట్టుకున్నా అధికారులు పట్టాలు ఇవ్వడంలో కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం పులివెందుల తహసీల్దారు... అదే కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న వ్యక్తి పేరిట ఆ భూమి ఉందని చెప్తూ.. మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని మాకే డీకేటీ పట్టా ఇచ్చి ఆన్‌లైన్‌లో మా పేర్లు నమోదు చేయాలని కోరారు.

పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం చంద్రాజుపాలేనికి చెందిన రామకోటేశ్వరరావు అర్జీ... మా గ్రామ పరిధిలోని సర్వే నెం.34లో 17 సెంట్ల భూమిని గతంలో సుబ్బయ్య అనే వ్యక్తి నుంచి చట్టబద్ధంగా కొనుగోలు చేశాను. ఇటీవల జరిగిన రికార్డుల నమోదులో జరిగిన లోపాల వల్ల, ఈ వ్యక్తిగత పట్టా భూమిని పొరపాటున 22(ఎ) చుక్కల భూముల జాబితాలో చేర్చారు. దీంతో ప్రస్తుతం ఆ భూమి పంచాయతీ ఆస్తిగా రికార్డుల్లో కనిపిస్తోంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

పై వాటితో పాటు పలువురు పింఛను, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని ఇంకొందరు అభ్యర్థనలు అందించారు.

# తమిళనాడు పడవలు రాకుండా చర్యలు

- కోస్టల్ మెరైన్ టాస్క్‌ఫోర్స్ బలోపేతం చేస్తాం
- మత్స్యకారుల మధ్య విభేదాలకు వైసీపీ ప్రయత్నం
- నెల్లూరు కలెక్టరేట్‌లో సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర

నెల్లూరు(చైతన్యరథం): రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా ఇసుకపల్లి గ్రామంలో తమిళనాడుకు చెందిన 8 పడవల స్వాధీనం, విడిచిపెట్టేసిన ఘటనపై జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, అటవీ, ఫైర్ అధికారులు, మత్స్యకార సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. తమిళనాడు బోట్లు ఏపీ సరిహద్దుల్లో వేట చేయడం వలన స్థానికులు నష్టపోతున్నారు. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను అక్కడే పరిష్కరించు కునేలా చూడాలి. అంతేగానీ.. రాజకీయ ప్రేరేపిత చర్యల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడం సరికాదు. తమిళనాడు నుంచి వచ్చే బోట్లతో జరుగుతున్న నష్టంపై ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కూడా చర్చిస్తాం. ఏపీ కోస్టల్ మెరైన్ వ్యవస్థకు చెందిన 18 బోట్లు మరమ్మతులకు గురవ్వడంతో సరైన టాస్క్‌ఫోర్స్ లేకుండా పోయిం ది. రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఫిషరీస్, ఫారెస్ట్ శాఖలతో కూడిన టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. ఏప్రిల్ 15 వరకు తమిళనాడు బోట్స్ రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. జూన్ 15 నాటికి పూర్తిస్థాయిలో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు.




## వైసీపీ నేతలు రాద్ధాంతం చేయాలని చూస్తుంటారు

మత్స్యకార గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆ గ్రామస్థులే చర్చించి పరిష్కరించుకునేలా అధికారులు తోడుగా నిలవాలి. మత్స్యకార వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. వైసీపీ నేతలు ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేయాలని ప్రయత్ని స్తున్నారు. జువ్వలదిన్నె ప్రాంతంలో షిప్ బిల్డింగ్ కంపెనీకి కొంత స్థలం కేటాయిస్తే.. హార్బర్ ప్రైవేటీకరణ అంటూ రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. రాష్ట్రమంతా కులాలు, మతాలు, గ్రామాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. వారి విష యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. మత్స్యకారులకు ఆది నుంచి అండగా నిలుస్తున్నది చంద్రబాబే. తొలిసారిగా వేట నిషేధ భృతి, 50 ఏళ్లకే పెన్షన్ వంటి పథకాలు ప్రకటించాం. ఇప్పుడు వేట నిషేధ సమయంలో 1.20 లక్షల మందికి రూ.20 వేల చొప్పున అందిస్తున్నాం. 50 సంవత్సరాలకే రూ.4000 పెన్షన్ అందిస్తున్నాం. మత్స్యకార ఉపాధి కోసం వలలు, పడవలు సబ్సిడీతో అందిస్తున్నాం. జీవో నెం.217 రద్దు చేసి మత్స్యకారులకు అండగా నిలిచాం. మత్స్యకారులు ఎదుర్కొం టున్న ప్రతి సమస్యనూ పరిష్కరించి వారికి అన్ని రకాలుగా తోడుగా నిలుస్తున్నామని వివరించారు.

## ఫిష్ ల్యాండింగ్‌కు రూట్ మ్యాప్ ఫిక్స్

మరోవైపు కృష్ణపట్నం పోర్టు వద్ద ఫిష్ ల్యాండింగ్‌కు ఎదుర వుతున్న సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తు న్నాం. పెండింగులో ఉన్న ఫిషింగ్ హార్బర్లను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు రూట్ మ్యాప్ ఫిక్స్ చేశాం. పులికాట్ సరస్సు సమస్య పరిష్కారానికి చర్యలు తీసు కుంటాం. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటాం. బ్యాంకుల నుంచి రుణాల మంజూరుకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి అవసరమైన మేరకు ఉపాధి అవకాశాలు కల్పి స్తాం. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్, జిల్లా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కళ్యాణచక్రవర్తి, ఎమ్మెల్యేలు వసమాడి వెంకటేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కృష్ణారెడ్డి, పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, రాజ్యసభ మాజీ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, జోనల్ కోఆర్డినేటర్ రాంగోపాల్‌రెడ్డి, ఫిషరీస్ కమిషనర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హోంమంత్రి అనిత జన్మదిన వేడుకలు

- నియోజకవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు
- నివాసంలో పండగ వాతావరణం



నక్కపల్లి (చైతన్యరథం): హోంమంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు నక్కపల్లి మంత్రి నివాసం వద్ద ఘనంగా నిర్వ హించారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య, అభిమానుల శుభాకాంక్షలతో నివాసం సందడిగా మారింది.వేలాది మంది ప్రజలు, పార్టీ నాయకులు, అభిమా నులు పాల్గొన్నారు. మంత్రి అనితకు శు భాకాంక్షలు తెలుపేందుకు వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, అధికారులు, ఉద్యోగులు, యువకులు, సంఘాల ప్రతినిధులు భారీగా తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇక పేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని కూటమి నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

# మిట్టల్ స్టీల్‌ప్లాంట్ చారిత్రాత్మక ఘట్టం



అనకాపల్లి(చైతన్యరథం): అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఏపీ పారిశ్రామిక రంగంలో చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యానించారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర తలరాతను మార్చనున్న మెగా స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఇదని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా ఏపీ ప్రాజెక్ట్ రికార్డు సృష్టించనుందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లక్షలాదిమందికి పైగా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు కల్పిం చనుందని రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యా నించారు. ఏటా 17 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగనుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కృషితో ఈ భారీ ప్రాజెక్ట్ సాకారమైందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్ ఇంజిన్‌గా మారనుందని పేర్కొన్నారు.

# ఆరు నెలల్లో స్వర్ణ వార్డులకు హద్దులు

- కార్యదర్శుల అనధికార డిప్యూటేషన్ల రద్దు
- ఏకీకృత కుటుంబ సర్వేతో నష్టం ఉండదు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



విశాఖపట్నం (చైతన్యరథం): స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యా లయాల ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ధ్యేయంగా సంబంధిత అధికారులు పనిచేయాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డుల పని తీరుపై మంత్రి స్వామి జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, సంబంధిత జిల్లా అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేందిర ప్రసాద్, స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు డైరెక్టర్ శివప్రసాద్, ప్రభుత్వ విప్ పీవీజీఆర్ నాయుడు, విష్ణుకుమార్ రాజు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏకీకృత కృత కుటుంబ సర్వే, పీ4, బంగారు కుటుంబాలు, ఆధార్, ఈకేవైసీ, కేపీఐ, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామ వార్డు కార్యదర్శుల ద్వారా 465 సేవలను ప్రజలకు అందిస్తున్నాం. రాబోయే ఆరు నెలల్లో స్వర్ణ గ్రామ వార్డులకు హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. గ్రామ వార్డు కార్యదర్శుల అనధికార డిప్యూటేషన్లు రద్దు చేసి తిరిగి వారిని యధా స్థానాల్లో నియమించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏకీకృత కుటుంబ సర్వే తప్పులు లేకుండా పూర్తి చేయాలని, తప్పులు జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సర్వే వల్ల ప్రజల కు ఎలాంటి నష్టం ఉండదని, ప్రభుత్వ అధికారులు చేస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కుటుంబ సర్వే, వాట్సాప్ సేవలు, మనమిత్ర ఆధార్ తదితర వాటిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవోలు జోనల్ అధికారులు, జిల్లా అధికారులు సమర్థ వంతంగా పర్యవేక్షణ చేసి ప్రజలకు వీలైనంత మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేయాలని కోరారు.

# రూ.44 కోట్లతో 150 ఆయుష్ కేంద్రాలు

- రెండు నెలల్లోగా ప్రారంభానికి సిద్ధం
- ప్రాచీన వైద్య విధానం బలోపేతం
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్




అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నూతన భవన నిర్మాణాలు, ఆధునీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన భారతీయ ప్రాచీన వైద్యసేవలు ప్రజలకు చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను ప్రారంభించామని వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. రూ.44కోట్లతో చేపట్టే ఈ భవనాల నిర్మాణాలు, ఆధునికీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, రెండు నెలల్లోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి) చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఒకేసారి భారీ ఎత్తున మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. నేషనల్ ఆయుష్ మిషన్ 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా మొత్తం 150 ఆయుష్ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు, ఆధునికీకరణ పనులకు ఆయుష్ శాఖ నిధులు మంజూరు చేసిం ది. కొన్ని ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని అరకొర సౌకర్యాలతో ఇరుకు గదుల్లో కొనసాగుతున్నా యి. ప్రాచీన వైద్య విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆయుష్ వైద్యశాలల రూపురేఖలు మారనున్నాయి. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణాలు, ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

## 50 శాతం పనులు పూర్తి

90 ఆయుష్ కేంద్రాలకు ఆధునీకరణ పనులు చేపట్టగా, 60 ప్రభుత్వాసుపత్రుల్లో నూతనంగా ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 26, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 26, జిల్లా ఆసుపత్రుల్లో 8 ఆయుష్ ఆరోగ్య కేంద్రాలను నూతనంగా నిర్మిస్తున్నారు. 50 శాతం మేర పనులు పూర్తికాగా రెండు నెలల్లోగా మిగతా పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తారు.

## ఐపీహెచ్ఎస్ మార్గదర్శకాల ప్రకారం

ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలు, 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'ల బ్రాండింగ్ నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యా లతో భవనాల్ని నిర్మిస్తున్నారు. ఆధునీకరణ పనులు, నూతన భవన నిర్మాణాలు అందుబాటులోకొస్తే పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటవుతాయి. మెడికల్ ఆఫీసర్‌కు ఒక రూము, ఫార్మసీకి ఒక రూము, రిసెప్షన్‌కు ఒక రూము, టాయిలెట్స్ వంటి సౌకర్యాల్ని కల్పిస్తున్నారు. జిల్లా ఆసుపత్రుల ప్రాంగణాల్లో నిర్మించే ఒక్కో ఆయుష్ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.50 లక్షలు చొప్పున వెచ్చిస్తారు. ఏలూరు, మచిలీపట్నం, ఒంగోలు, చిత్తూరు, కడప, కర్నూలు, నంద్యాల జిల్లా ఆసుపత్రుల్లో నూతనంగా ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నారు.

# పునరుత్పాదక విద్యుత్ రంగంలో అగ్రస్థానమే లక్ష్యం

- రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను పూర్తిచేయండి
- పెట్టుబడిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఇక 15 రోజులకు ఒకసారి పురోగతిపై సమీక్షిస్తాం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తల ప్రాజెక్టుల అమ లపై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్షించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో బ్రూక్ ఫీల్డ్-యాక్సిస్ ప్రతినిధులు, నెడ్‌క్యాప్ ఉన్నతాధికారులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న పునరు త్పాదక విద్యుత్ ప్రాజెక్టుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నా రు. ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేసి, కమిషన్ చేసే దిశగా పెట్టుబడిదారులు చర్యలు తీసుకోవాలని సూచించా రు. అమలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. అవస రమైన భూమి, మౌలిక సదుపాయాలు, ఇతర అనుమతుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని అమలు చేస్తూ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు దేశానికి ఆదర్శంగా నిలవనున్నాయని పేర్కొ న్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశముం దని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే భవిష్యత్తులో రాష్ట్రాన్ని "బ్యాటరీ స్టోరేజ్ క్యాపిటల్"గా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి సంకల్పాన్ని అధికారులకు గుర్తు చేశారు. పునరుత్పాదక విద్యుత్ రంగ అభివృద్ధితో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశా లు లభిస్తాయని... ఇకపై ప్రాజెక్టుల అమలు, పురోగతిపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ఉన్నతాధికారులు, వివిధ పునరుత్పా దక విద్యుత్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి చిహ్నం యోగాంధ్ర మెమోరియల్

- ప్రధాని సందర్శనకు గుర్తుగా చిహ్నం
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- యోగా విలేజ్‌లో పైలాన్ ప్రారంభోత్సవం



విశాఖపట్నం(చైతన్యరథం): ప్రజారోగ్య చిహ్నంగా యోగా గుర్తుగా యోగాంధ్ర మెమోరియల్ నిలవనుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఈస్ట్ జోన్ పరిధిలోని వార్డు నెం.21లో బీచ్ రోడ్డులో ఉన్న యోగా విలేజ్‌లో నిర్మించిన యోగాంధ్ర మెమోరియల్‌ను మంగళవారం సాయం త్రం స్థానిక ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు క్రమశిక్షణతో అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఆ సహకారమే విశాఖపట్నంలో పరిశ్రమల స్థాపనకు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి, విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ బోర్డు వంటి కార్యక్ర మాల విజయానికి మూలకారణమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, అలాగే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నా రని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి సందర్శించిన ఈ ప్రాంతానికి గుర్తుగా విక్టరీ ఎట్ సీ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నౌకా దళం శౌర్య గాథలను భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా, ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజేసేలా ఈ యోగా చిహ్నాన్ని ఏర్పాటు చేసి నట్లు వెల్లడించారు. ఈ మెమోరియల్ ఏర్పాటుతో యోగా విలేజ్ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారడంతో పాటు ప్రజలకు సుందరమైన విశ్రాంతి వాతావరణం అందుబాటులోకి రానుందన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో స్థానిక యోగా విలేజ్ సమీపంలో సుమారు రూ.69.55 లక్షల అంచనా వ్యయంతో ఈ మెమోరి యల్ నిర్మాణం చేపట్టారు. పింక్ శాండ్ స్టోన్‌తో మెమోరియల్ నిర్మాణంతో పాటు విగ్రహం ఏర్పాటు, ఫ్లోరింగ్ పనులు పూర్తి చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా జైపూర్ శాండ్ స్టోన్‌తో 2505 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లోరింగ్, జోధ్‌పూర్ శాండ్ స్టోన్‌తో శిల్ప నిర్మాణం, కార్పెట్ గడ్డితో ల్యాండ్‌స్కేపింగ్, ఫోకస్ లైటింగ్ ఏర్పాటు వంటి పనులు నిర్వహించారు. ఈ పనులకు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి వ్యయం చేయగా..ఎం/ఎస్ సెవెన్ హిల్స్ అసోసియేట్స్ సంస్థ పనులను చేపట్టింది. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీలు రమణమూర్తి, సత్యవేణి తదితర ప్రజాప్రతి నిధులు, అధికారులు పాల్గొన్నారు. పద్మనాభం ప్రాంతానికి చెందిన యోగా విద్యార్థిని శిరీషా యోగాసనాలు వేశారు. అతిథులంతా ఆమెను సత్కరించారు.

# డిస్టిలరీ లేకపోయినా రూ.732 కోట్ల వ్యాపారం!

- 'తాడేపల్లి ప్యాలెస్' లిక్కర్ స్కామ్
- కుంభకోణంలో 5 విస్తుపోయే నిజాలు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో లిక్కర్ కుంభకోణంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మద్యపాన నిషే ధాన్ని విడతల వారీగా అమలు చేస్తామని నమ్మబలికి అధికారం లోకి వచ్చిన జగన్.. తెరవెనుక అసలు ప్రణాళికను అమలు చేశా రు. వారు నిషేధించింది ప్రజల వ్యసనాన్ని కాదు.. కేవలం తమకు కమీషన్లు ఇవ్వని ప్రముఖ బ్రాండెడ్ మద్యాన్ని మాత్రమే! ఆ బ్రాండ్లను తరిమేసి సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకుని కోట్లు కొల్లగొట్టే ప్రణాళికను తాడేపల్లి ప్యాలెస్ వేదికగా సిద్ధం చేశారు. దేశమంతా డిజిటల్ విప్లవంతో దూసుకుపోతుంటే ఏపీలో మాత్రం మద్యం దుకాణాల్లో 'ఓన్లీ క్యాష్' అనే వింత నిబంధన పెట్టారు. ఈ నగదు లావాదేవీల వెనుక ఉన్న అసలు రహస్యం దాగి ఉంది. మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజల సంక్షేమానికి కాకుండా పాలకుల జేబుల్లోకి ఎలా మళ్లించారో ఈడీ దర్యాప్తు రిపోర్ట్‌లో వెల్లడైంది.

### 1.అదృశ్య ఫ్యాక్టరీ..అద్భుతమైన ఆదాయం

ఈ కుంభకోణంలో అత్యంత విస్తుపోయే అంశం 'అదాన్ డిస్టిలరీస్' అనే కంపెనీ ఉదంతం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రకారం ఈ కంపెనీకి సొంతంగా ఎలాంటి డిస్టిలరీ లేదు, కనీసం మద్యం తయారీకి అవసరమైన ఒక్క యంత్రం కూడా లేదు. అయినప్పటికీ కేవలం మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా రూ.732 కోట్ల వ్యాపారం చేసింది. సొంతంగా తయారీ సామర్థ్యం లేకపోయినా విశాఖ డిస్టిలరీస్, పీఎంకే డిస్టిలరీస్, ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ వంటి సంస్థలను లీజుకు తీసుకుని తమ ఫ్లాగ్‌షిప్ బ్రాండ్ అయిన 'సుప్రీమ్ బ్లెండ్ విస్కీ' వంటి బ్రాండ్లను మార్కెట్లోకి తెచ్చారు. రాజకీయ అండదండలతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి అడ్డగోలుగా ఆర్డర్లు పొంది ఇతర ప్రముఖ కంపెనీలను తొక్కిపెడుతూ ఈ అక్రమ సామ్రాజ్యాన్ని నడిపారు. "అదాన్ డిస్టిలరీస్ అనేది కేవలం కాగితాల మీద ఉన్న ఒక పక్కా క్రిమినల్ షెల్ కంపెనీ. రాష్ట్ర మద్యం వ్యాపారాన్ని దోచుకుని ఆ నిధులను సిండికేట్ నాయకులకు మళ్లించడానికే దీన్ని ఒక ప్రత్యేక వాహనంగా సృష్టించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పష్టం చేసింది.

### 2.లిక్కర్ షాపులా లేక పొలిటికల్ ఏటీఎంలా?

ప్రపంచమంతా యూపీఐ, కార్డ్ పేమెంట్ల వైపు వెళుతుంటే ఏపీలోని మద్యం దుకాణాలను మాత్రం ఉద్దేశ పూర్వకంగా వెనక్కి నెట్టారు. 2019 కంటే ముందు ఉన్న ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థ ను కావాలనే 'తుంగలో తొక్కారు'. ఎందుకంటే డిజిటల్ రికార్డులు ఉంటే అక్రమ వసూళ్లు బయటపడతాయనే భయం. అందుకే ఆటోమేటెడ్ సిస్టమ్‌ను తీసేసి 'మాన్యువల్' పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ మ్యాన్యువల్ బిల్లింగ్ ద్వారా ప్రతినెలా సుమారు రూ.100 కోట్ల చొప్పున అక్రమ వసూళ్లు చేస్తూ మద్యం దుకాణాలను పాలక పక్షానికి ఏటీఎంలుగా మార్చేశారు. డిజిటల్ ఆడిట్ ట్రయల్ లేకుండా చేయడం ద్వారా గోనె సంచుల్లో నింపిన నగదును ఎవరికీ దొరక్కుండా కంటైనర్ల ద్వారా పైస్థాయికి చేరవేసే పక్కా వ్యవస్థను రూపొందించారు.

### 3. జే-బ్రాండ్ల మాయాజాలం: 15-20% కిక్‌బ్యాక్స్

ప్రజలు ఎప్పుడూ వినని, నాణ్యత లేని కొత్త బ్రాండ్లను (జే బ్రాండ్స్) మార్కెట్లోకి ప్రవేశపెట్టడమే ఈ స్కామ్‌లోని ప్రధాన వ్యూహం. ప్రముఖ కంపెనీల బ్రాండ్లను అణచివేస్తూ, 'సుప్రీమ్ బ్లెండ్ విస్కీ' వంటి జే-బ్రాండ్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వినియోగదారులకు కిక్కు రాకపోయినా, అక్రమార్కులకు మాత్రం 15% నుంచి 20% వరకు కిక్‌బ్యాక్స్ రూపంలో కాసుల వర్షం కురిసింది. అదాన్ డిస్టిలరీస్ వంటి సంస్థలు తమ మార్కెట్ స్థానా న్ని కాపాడుకోవడానికి సుమారు రూ.135 కోట్ల కిక్‌బ్యాక్స్ చెల్లించి నట్లు ఈడీ గుర్తించింది. ఈ నిధుల మళ్లింపు కోసం ఎంఎస్ ప్రైమ్ సర్వీసెస్ వంటి వెండర్లను వాడుకున్నారు. వస్తువులు సరఫరా చేయకపోయినా చేసినట్లుగా భారీ బిల్లులు సృష్టించి (inflated payments), ఆ తర్వాత ఆ సొమ్మును నగదు రూపంలో తిరిగి పొందేలా పక్కాగా స్కెచ్ వేశారు.

### 4. లిక్కర్ నుంచి గోల్డ్, రియల్ ఎస్టేట్ వరకు

మద్యం ద్వారా వచ్చిన ఈ అక్రమ సొమ్మును లాండరింగ్ చేయడానికి ముంబైలోని ఓల్విక్ మల్టీవెంచర్స్, నిస్సా మల్టీవెంచర్స్ వంటి నాన్-ఆపరేషనల్ షెల్ కంపెనీలను వేదికగా చేసుకున్నారు. అంతేకాకుండా హవాలా పద్ధతిలో ఈ సొమ్మును దుబాయ్ వరకు చేరవేశారు. అక్రమంగా సంపాదించిన నగదును బులియన్ (బంగారం) రూపంలోకి మార్చడానికి మోహన్‌లాల్ జ్యువెలర్స్, రావు సాహెబ్ బూరుగు మహాదేవ్ జ్యువెలర్స్ వంటి వర్తకులను వాడుకున్నారు. అలాగే దాదాపు రూ.39.8 కోట్ల నిధులను ఫీనిక్స్ గ్రూప్, వెల్లర్‌నెస్ రాంచ్ వంటి భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులలో పెట్టుబడిగా మళ్లించినట్లు ఈడీ ఆధారాలు సేకరించింది.

### 5. జప్తు పర్వం - ప్రధాన సూత్రధారులు, పొలిటికల్ లింకులు

ఈ మెగా స్కామ్‌పై కొరడా ఝుళిపించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటివరకు రూ.441.63 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ఈ స్కామ్‌లో 'ప్రిన్సిపల్ కింగ్‌పిన్'గా భావిస్తున్న కేసిరెడ్డి రాజశేఖరరెడ్డి, మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, బూనేటి చాణక్య వంటి వారి బ్యాంకు ఖాతాలు, భూములను అటాచ్ చేసింది. అన్నింటికంటే షాకింగ్ విషయం ఏమిటంటే ఈ అక్రమ దందాకు అవసరమైన రూ.60 కోట్ల ప్రాథమిక పెట్టుబడిని అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి, పెనక శరత్‌చంద్రారెడ్డి (అరబిందో ఫార్మా మాజీ డైరెక్టర్)కి చెందిన వ్యక్తిగత ఖాతాల నుంచే మళ్లించి నట్లు ఈడీ దర్యాప్తులో స్పష్టమైన ఆధారాలు లభించాయి. "మద్యపాన నిషేధం అంటే పాత బ్రాండ్లను నిషేధించి, కొత్త బ్రాండ్ల ద్వారా జేబులు నింపుకోవడమేనని ఈ వ్యవస్థ నిరూపిం చింది. సుమారు రూ.3,500 కోట్ల భారీ కుంభకోణంగా భావిస్తున్న ఈ లిక్కర్ స్కామ్‌లో బయటపడిన ఈ విషయాలు కేవలం ఆరంభం మాత్రమే. ఒకవైపు ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి, మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతూ మద్యం దుకాణాలను సొంత ఖజానాగా మార్చుకున్న ఈ వ్యవస్థ ఎంతటి ప్రమాదకరమో అర్థమవుతోంది. వ్యవస్థను మేనేజ్ చేసి సాఫ్ట్‌వేర్‌లను మార్చేసి వేల కోట్ల ప్రజా ధనాన్ని పక్కదారి పట్టించిన ఈ 'తాడేపల్లి సిండికేట్'పై విచారణ ఎంతవరకు వెళుతోందో చూడాలి. ఇది కేవలం అవినీతి మాత్రమే కాదు..రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై, నమ్మకంపై జరిగిన అతిపెద్ద దాడి. డబ్బు పిశాచి జగన్ చేసిన పైశాచిక దోపిడీ.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన

**●కనిమెర్లతండాలో హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ శంకుస్థాపన**



మైలవరం (చైతన్యరథం): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన ఉందని, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మైలవరం మండలంలోని కనిమెర్లతండాలో రూ.36లక్షల 15వ ఆర్థికసంఘం నిధులతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం (హెల్త్ సెంటర్) నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు మంగళవారం శంకుస్థాపన చేశారు. పోరాట నగర్లో రూ.10 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించిన పశువుల వసతి శాలను (పశువుల హాస్టల్) కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... పల్లెల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణంతో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజారోగ్య సంరక్షణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మైలవరం నియోజకవర్గంలో రూ.9.35 కోట్లతో 29 హెల్త్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో భవనం పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు పశువుల హాస్టళ్లకు బీజం వేశారన్నారు. మూగజీవుల కోసం మేత, తాగునీరు, షెడ్లు వంటి ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సన్న, చిన్నకారు, పశు పోషకుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ పశుపోషకుల సంక్షేమం కోసం కూడా కృషి చేస్తోందని అభినందించారు.

# చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే బండారు



కొత్తపేట (చైతన్యరథం): రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడుస్తుందని, చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం కొత్తపేట మండలం వానపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు ఆర్డీఎస్ స్కీం ద్వారా వానపల్లి గ్రామానికి 24 గంటలు నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించే రూ.3కోట్ల 50 లక్షల రూపాయలతో పనులను ప్రారంభించమన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కొత్తపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి తదితరులతో కల్సి ఆయన పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధికి అంతం లేదని, ఎంత అభివృద్ధి సాధించినా ఇంకా చేయాల్సిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియని ఎమ్మెల్యే బండారు అన్నారు. వానపల్లిలో రూ.8.32కోట్లతో 45పనులు, 27 పనులు రూ.1.73కోట్లతో పనులకు ప్రారంభోత్సవం చేయడం ఆనందంగా ఉందన్నారు. వానపల్లి పంచాయతీకి ఒకనాడు కారు కూడా రాలేని విధంగా రహదారులు అధ్వాన్నంగా ఉన్న పరిస్థితి నుంచి స్వర్ణ వానపల్లిగా తీర్చిదిద్దామన్నారు. వానపల్లిలో ముఖ్యమంత్రి చెప్పిన పనులు ఇంకా ఉన్నాయని, వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు.

# మోడల్ నియోజకవర్గంగా నరసరావుపేట!

**పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం.... జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి ఎమ్మెల్యే అరవిందబాబు పర్యటన**



నరసరావుపేట (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ, నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ వారి సమస్యలను తీరుస్తున్న జననేత, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు మరోసారి తన సేవా నిరతిని చాటుకున్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి ఆయన నగరంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఏసీ గదులకే పరిమితం కాకుండా, ఎండనక వాననక గడప గడపకూ తిరుగుతూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుంటున్న 'ప్రజల ఎమ్మెల్యే'గా అరవిందబాబు గుర్తింపు పొందారు. 5,6,7 వార్డులకు చెందిన ఈ కాలనీలో పర్యటించి, అక్కడ నివసిస్తున్న సుమారు 360 ఇళ్ల ప్రజలకు పొజిషన్ పట్టాలు ఇచ్చే అంశంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఎస్.ఆర్.కె.టి కాలనీలోని 18వ లైన్ సమీపంలో నివసిస్తున్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చే ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యను పరిష్కరించడానికి స్వయంగా రంగంలోకి దిగి, పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న అపర భగీరథుడిగా ఆయన నిలిచారు.

# స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక విప్లవం

**● ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మొదలైన కొత్త యుగం: చీఫ్ విప్ జీవీ**

వినుకొండ (చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ మరియు నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక కొత్త యుగం మొదలైందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. దేశ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే ఈ సమీకృత ఉక్కు కర్మాగారానికి కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఘనంగా శంకుస్థాపన చేయడం జరిగింది. సుమారు రూ.1,35,964 కోట్లకు పైగా భారీ పెట్టుబడితో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్, దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలవడమే కాకుండా, రాష్ట్రానికి పెద్ద ఎత్తున గర్వకారణంగా నిలుస్తుందని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష మరియు పరోక్ష ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని, దీనివల్ల స్థానిక యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి లభించడమే కాకుండా స్కిల్ డెవలప్మెంట్, టెక్నికల్ ట్రైనింగ్ మరియు అనుబంధ పరిశ్రమల ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు.




**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్**

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్", పారదర్శక పాలసీలు మరియు వేగవంతమైన అనుమతులే ప్రపంచ స్థాయి కంపెనీలను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించాయని, ఇది ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని జీవీ ఆంజనేయులు కొనియాడారు.

# కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటాం

**●12 మందికి బిసిటీ తరపున ఆర్థిక సహాయం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 1వ డివిజన్ నారాయణపురం వాంబే గృహాల వద్ద నగర పాలక సంస్థ చేపట్టిన ఆక్రమణల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన 12 మందికి వారి కుటుంబ అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున (బిసిటీ) ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల ప్రయోజనాల కోసం జరుగుతున్నప్పటికీ, వాటి వల్ల ఇబ్బందులు పడుతున్న పేదలను ప్రభుత్వం మరియు తమ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని చెప్పారు. ఉపాధి కోల్పోయిన వారికి తిరిగి జీవనోపాధి కల్పించేందుకు కూడా సహాయం అందిస్తామని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వారికి అండగా నిలవడం ప్రజా ప్రతినిధిగా తమ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కష్టాల్లో ఉన్న వారికి బిసిటీ తరపున సహాయం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలకు అండగా కూటమి ప్రభుత్వం

**●రూ.1.70 లక్షల విలువైన 2కేవీ సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు 100 శాతం సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం**

**●తొలి యూనిట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



దెందులూరు (చైతన్యరథం): "ఎస్సీ ఎస్టీలకు నూరు శాతం సబ్సిడీపై ఒక్క రూపాయి కూడా ఎటువంటి ఆర్థిక భారం వారిపై లేకుండా వారి ఇంటి వద్ద 2 కిలో వాట్స్ (2KW) సామర్థ్యం గల సోలార్ విద్యుత్ యూనిట్లను ఉచితంగా అందిస్తున్న సందర్భంగా తొలి యూనిట్ను దెందులూరు మండలం దెందులూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారుల ఇంటి వద్ద మంగళవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని, ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించిన కూటమి ప్రభుత్వం తాజాగా ఎస్సీ ఎస్టీలకు దాదాపు రూ.1లక్ష 70వేల రూపాయల విలువైన రెండు కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన 2 కేడబ్ల్యూ సోలార్ విద్యుత్ యూనిట్లను వారికి నూరు శాతం సబ్సిడీపై అందిస్తూ ఇంటి వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుందని, దెందులూరు నియోజకవర్గంలోని 4707 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రాబోయే రోజుల్లో ఇదేవిధంగా సోలార్ విద్యుత్తు యూనిట్లను ఉచితంగా అందించనున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అనంతరం దెందులూరు గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సీసీ రోడ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా పర్యవేక్షించారు.

# పెదకూరపాడులో ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ సదస్సు

పెదకూరపాడు (చైతన్యరథం): నియోజకవర్గం 75 తాళ్లూరులో జరిగిన ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ సదస్సులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు, సహచర శాసనసభ్యులతో కలిసి మాజీ మంత్రి, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. సొంతంగా ఒక పరిశ్రమను స్థాపించాలనే ఆశ చాలా మంది వ్యాపారవేత్తలలో ఉంటుంది. అయితే భూమి అందుబాటు, మౌలిక సదుపాయాలు మరియు ప్రారంభ పెట్టుబడి వంటి అంశాలు కొత్త పరిశ్రమల స్థాపనలో పెద్ద సవాళ్లుగా మారతాయని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో MSME ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేయబడుతున్నాయి. ఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి అవసరమైన రహదారులు, విద్యుత్ సరఫరా, నీటి సదుపాయం మరియు ఇతర మౌలిక వసతులు ముందుగానే సిద్ధంగా ఉంటాయి. దీంతో పరిశ్రమలను త్వరగా ప్రారంభించే అవకాశం లభిస్తుంది. IDP Policy 4.0 ద్వారా భూమి అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం అందించడం ద్వారా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి భారం తగ్గుతుంది. ఈ విధమైన ప్రైవేట్ MSME ఇండస్ట్రియల్ పార్కులు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడుతూ కొత్త పరిశ్రమలకు మార్గం చూపడమే కాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా పెంచుతున్నాయి. ఫలితంగా ప్రాంతీయ అభివృద్ధి మరియు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతోంది. మహిళలు కుటుంబానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కీలక శక్తిగా ఎదగాలన్న దూరదృష్టితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించిన DWACRA ఉద్యమం లక్షలాది మహిళల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకొచ్చింది." అని తెలిపారు.

# కూటమి చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్ళండి

**◆మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**



మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల శిక్షణ తరగతులలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని, అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజలకు నేరుగా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఇకపై అభివృద్ధితో పాటు, తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేసే శక్తులను దీటుగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. వైసీపీ చేయకూడని పాపాలు చేసి, ఇప్పుడు కూడా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వైసీపీ దుష్ప్రచారాలతో నిండిపోయిందని, తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండంతో పాటు ఆ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తెలుగుదేశం కార్యకర్తలదేనని ఆయన స్పష్టం చేశారు.

# మధ్యాహ్న భోజన నాణ్యతపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకస్మిక తనిఖీ

**◆ స్వయంగా రుచి చూసి అధికారులకు కీలక ఆదేశాలు**



విజయవాడ (చైతన్యరథం): విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం రుచిగా శుచిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు అవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా భోజనశాలకు వెళ్లి, విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహారం నాణ్యతను పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కాసేపు ముచ్చటించి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కేవలం కడుపు నింపడమే కాకుండా, అది రుచిగా, అత్యంత శుచిగా ఉండేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. భోజనం సిద్ధమైన తర్వాత విద్యార్థులకు వడ్డించే ముందు, ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఆ ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను ధృవీకరించాలని ఆయన ఆదేశించారు.

# రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం

**◆ రైతున్న మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్**



పెడన (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కల్పించడం కోసం కృత్తివెన్ను మండలం చేరుకుమిల్లు గ్రామంలో "రైతన్న మీ కోసం" కార్యక్రమాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, స్థానిక అధికారులు కూటమి నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... అర్హత కలిగిన రైతుల ఖాతాల్లోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు విడతలుగా రూ.20,000 ఆర్థిక సహాయం జమ చేసింది రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 47 లక్షల మంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల ద్వారా రూ.2677 కోట్ల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఈ సహాయం రైతులకు పంటల సాగు ఖర్చులను తగ్గించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే సూచించారు.

# నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం

**● విజయవాడ ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు**




విజయవాడ (చైతన్యరథం): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తామని, విద్యార్థులు చక్కగా చదువుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు వ్యాఖ్యానించారు. మంగళవారం 12వ డివిజన్‌లో సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న దామోదర సంజీవయ్య నగర పాలక సంస్థ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... పాఠశాలకు వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థికీ తమ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పుస్తకాలు, యనిఫామ్, బ్యాగ్‌లతో పాటుగా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు తల్లికి వందనం పేరుతో అందచేశామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడమే కాకుండా ప్రతి రోజూ వారి మెనూను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్దేశించి అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు చదువుతో పాటుగా ఆరోగ్యాన్ని అందించేందుకు వైద్య శిబిరాలు, టీకాలు ఇవ్వడమే కాకుండా పాఠశాల ఆవరణలో ఆర్వో ప్లాంట్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఈ సారి బడ్జెట్‌లో విద్యాశాఖకు కేటాయింపులు కూడా భారీగా పెంచామని చెప్పారు. పిల్లలు చక్కగా చదువుకుని అత్యుత్తమ మార్కులు సాధించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొట్లూరి సాయిబాబు, మేదరమెట్ల నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి

**◆41 మందికి రూ.32 లక్షల చెక్కుల పంపిణీ చేసిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు పశ్చిమ (చైతన్యరథం): అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్యమంత్రి సహాయనిధి (CM Relief Fund) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అత్యవసర వైద్య అవసరాలు మరియు ఇతర కష్టకాల పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ రోజు ఒక్కరోజే మొత్తం 41 మందికి రూ.32,37,844/- విలువైన చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సహాయం ద్వారా అనేక కుటుంబాలకు ఉపశమనం కలిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందుతోందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 505 మంది లబ్ధిదారులకు రూ.6,77,85,662/- విలువైన సహాయం అందజేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు.

# నీటి పారుదల పనులకు రూ.3.50 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం తమ కార్యాలయంలో ఇరిగేషన్ NSP డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలో నీరుపారుదల నిర్వహణ, మరమ్మత్తు పనులు, కాలువల పరిస్థితి, అత్యవసర అవసరాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... 2019-24 కాలంలో నిర్లక్ష్యానికి గురైన నీరుపారుదల నిర్వహణ, మరమ్మత్తు పనులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. గత ఏడాది ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కొంత మేర O&M పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహణ మరియు మరమ్మత్తు పనులు తప్పనిసరిగా చేపట్టాలనే సంకల్పంతో 2026-27 సంవత్సరానికి సంబంధించి నియోజకవర్గానికి మొత్తం రూ.3.50 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో చీఫ్రా పరిధిలో రూ.2.50 కోట్లు, చీఫ్రా కాకుండా ఇతర పనుల కోసం రూ.1.00 కోటి అంచనాలు రూపొందించాలని సూచించారు. ఈ పనులను అత్యవసరత, అవసరాల ప్రాతిపదికన గుర్తించి ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు సమర్పించాలని ఆమె అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడేలా కాలువల పునరుద్ధరణ, నీటి సరఫరా సౌకర్యాల మెరుగుదల, చెదిరిపోయిన నిర్మాణాల మరమ్మత్తు వంటి పనులను ముందుగా గుర్తించాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో నీరుపారుదల వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులను కోరారు.

# వ్యవసాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మోపిదేవి (చైతన్యరథం): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అంగన్వాడీ రాష్ట్ర విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. మంగళవారం నాగాయ తిప్పలో ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం సాగు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం, రైతు కష్టాలను తగ్గించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ రైతులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# మాట తప్పని మంత్రి నారాయణ...

## కాపు భవన్ ఆధునీకరణకు మరో కోటి రూపాయల సొంత నిధులు

- జిల్లా కలెక్టర్ణ్‌కి కోటి రూపాయల చెక్కును అందించిన మంత్రి నారాయణ అల్లుడు పునీత్
- జూలై నాటికి కాపు భవన్ సిద్ధమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కీలక ప్రకటన



నెల్లూరు (చైతన్యరథం): కాపులకిచ్చిన మాటను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు మంత్రి నారాయణ నిలబెట్టుకున్నారు. కాపు భవన్ ఆధునీకరణకు కోటి రూపాయల విరాళం ఇచ్చారు. చెక్కును మంత్రి అల్లుడు పునీత్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందచేశారు. రెండు విడతల్లో రెండు కోట్లు ఇచ్చిన మంత్రికి కాపు భవన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్న మంత్రి నారాయణ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. కాపు భవన్ ఆధునీకరణ కోసం ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధుల నుండి రెండవ విడతగా రూ.1 కోటి విరాళాన్ని ప్రకటించారు. మంగళవారం మంత్రి అల్లుడు పునీత్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి కోటి రూపాయల చెక్కును అందజేశారు. గతంలోనే కాపు భవన్ అభివృద్ధి కోసం కోటి రూపాయల సొంత నిధులు ఇచ్చిన మంత్రి, ఇప్పుడు మళ్ళీ కోటి రూపాయలు కేటాయించడంపై కాపులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ... మంత్రి నారాయణ అందించిన ఈ నిధులతో వచ్చే జులై నాటికే కాపు భవన్ ఆధునీకరణ పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. తమ అభ్యర్థనను మన్నించి, ఇచ్చిన మాట ప్రకారం మొత్తం రూ.2 కోట్లు కేటాయించినందుకు కాపు భవన్ కమిటీ సభ్యులు మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, మంత్రి అల్లుడు పునీత్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు భవన్ నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ వేట నిరోధంపై మత్స్యకారులకు భరోసా కల్పించాలి



సర్వేపల్లి (చైతన్యరథం): అక్రమ వేట నిరోధంపై మత్స్యకారులకు భరోసా కల్పించాలని, నిఘా బోట్లకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త బోట్లు కొనుగోలు చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తమిళనాడు, పాండిచేరి బోట్ల అక్రమ వేట నిరోధంపై నెల్లూరు కలెక్టరేట్‌లో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, కొల్లు రవీంద్ర, ఆనం రామనారాయణరెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, మోపిదేవి వెంకటరమణ, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ ఎస్పీ అజిత నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "సముద్రంలో నిఘా వ్యవస్థను పటిష్టపరచాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బోట్లను రిపేరు చేయించాలి..కొత్త బోట్లు కొనుగోలు చేయాలి. పులికాట్ సరస్సుకు సంబంధించి సముద్ర ముఖ ద్వారాల పూడికతీయాలి. నేలటూరు ఫిషింగ్ జెట్టీ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించాల్సిన బాధ్యత ఏపీ మారిటైం బోర్డుపై ఉంది. రూ.300 నుంచి రూ.400 కోట్లు ఖర్చు పెడితే మత్స్యకారుల ప్రధాన సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. ఈ నిధుల కోసం అందరం వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి విజ్ఞప్తి చేద్దాం. కృష్ణపట్నంలోని కోస్ట్ గార్డు సేవలను ఏ విధంగా వినియోగించుకోవాలో కూడా ఆలోచించాలి. మెరైన్ విభాగంలో కానిస్టేబుల్ పోస్టులన్నీ భర్తీ చేయాలి..అవసరమైతే అదనపు పోస్టులు కూడా కేటాయించాలి. రూ.1.20 కోట్ల విలువైన డీప్ సీ బోటుకు మహిళలకు ఇస్తున్న సబ్సిడీ 40 శాతమే ఉండటంతో కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. 60 శాతం సబ్సిడీ ఇస్తే ఈ బోట్లపై మత్స్యకారులు ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఆ అదనపు 20 శాతం సబ్సిడీని సీఎస్ఆర్ నిధుల ద్వారా అయినా సమకూర్చేందుకు ప్రయత్నిస్తాం. మత్స్యకారులకు ఒక భరోసా కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది." అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఉద్యాన పంటలతోనే అధిక ఆదాయం : ప్రత్తిపాటి

- ఏడాదికి రూ. 2 నుంచి రూ.3లక్షల ఆదాయం వచ్చే డిమాండ్ ఉన్న పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి
- వేలూరు, సందెపూడిలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రతి ఎకరాకు అధిక దిగుబడి. ప్రతి రైతుకు మంచి లాభం రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయానికి, పాడిపోషణకు ప్రభుత్వాలు అందించే రాయితీలను రైతాంగం సద్వినియోగం చేసుకొని, తమ జీవనప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. రైతన్నా మీకోసం – అన్నదాతా సుఖీభవ కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట మండలం వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి గ్రామాల్లో వ్యవసాయవిభాగం నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రత్తిపాటి పాల్గొన్నారు. వేలూరులో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, సందెపూడిలో రూ.30లక్షలతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం (కమ్యూనిటీ హాల్), రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైన్లకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రెండు గ్రామాల్లోనూ పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వవిధివిధానాలు, నూతనసాగు పద్ధతులను ప్రత్తిపాటి అన్నదాతలకు అర్థమయ్యేలా వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన గ్రామసభల్లో మాట్లాడారు.

**ఎకరాకు రూ.2 నుంచి రూ.3 లక్షల ఆదాయమొచ్చేపంటలే సాగు చేయండి**

ఎకరాకు రూ.4 నుంచి రూ.5 లక్షల ఆదాయం వచ్చే ఉద్యాన పంటల సాగుకు రైతులు ఈ ఏడాదే సిద్ధం కావాలన్నారు. ఏడాదికి రూ.4, లేదా రూ.5 లక్షల ఆదాయం వస్తే.. దానిలో ఖర్చులు రూ.2లక్షలు పోయినా, రైతుకు రూ.2 లేదా 3 లక్షలు తప్పకుండా మిగులుతాయన్నారు. 90శాతం సబ్సిడీపై ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వాలు అందించే అన్నిరకాల రాయితీలను రైతులు వినియోగించుకొని, తమ జీవితాలు మార్చుకోవాలన్నారు. పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. డిమాండ్ అధికంగా ఉండి, ఎక్కువ దిగుబడినిచ్చే పంటలసాగువైపు రైతులు మళ్లడానికి ఇదే సరైన సమయమని ప్రత్తిపాటి సూచించారు.

**అర్హులైన వారు ఉచిత ఇళ్లస్థలాలకు ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలి...**

టీడీపీ మేనిఫెస్టో హామీ ప్రకారం త్వరలోనే ఇళ్లస్థలాలు లేని పేద, మధ్యతరగతి వర్గాలకు పల్లెల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఉచిత స్థలాలు అందచేయనున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఇంటిపట్టాలు పొందాలంటే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

# భారీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం రాష్ట్రానికి గర్వకారణం

- యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు : ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి



కావలి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ – నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం రాష్ట్రానికి గర్వకారణమని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కావడం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కీలక మైలురాయి అని అన్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. 5,465 ఎకరాల్లో రెండు దశల్లో అమలు చేయనున్న ఈ ప్లాంట్ ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని, ముఖ్యంగా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కేవలం ఉక్కు తయారీకి పరిమితం కాకుండా, స్కిల్ డెవలప్మెంట్, టెక్నికల్ ట్రైనింగ్, అనుబంధ పరిశ్రమల ద్వారా యువతకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించనున్నదని వివరించారు. ఎంఎస్ఎంఈలు, చిన్న పరిశ్రమలు కూడా ఈ ప్రాజెక్ట్ ద్వారా అభివృద్ధి చెందుతూ స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తాయని అన్నారు. మంత్రి నారా లోకేష్ కృషి ఈ ప్రాజెక్ట్ వెనుక ప్రధాన శక్తిగా నిలిచిందని ఎమ్మెల్యే కొనియాడారు.

# సీఎం సహాయనిధి... పేదలకు పెన్నిధి

- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు (చైతన్యరథం) : ఒంగోలు నియోజకవర్గానికి చెందిన పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన సాయాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అందజేశారు. సీఎం సహాయనిధి... పేదలకు పెన్నిధి అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో 42 మందికి లబ్ధిదారులకు రూ.35.60 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రావు మాట్లాడుతూ... ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య చికిత్సపొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అబ్దుల్ అజీజ్‌ను పరామర్శించిన కూటమి నేతలు



నెల్లూరు (చైతన్యరథం): ఇటీవల కాలంలో మాతృ వియోగం చెందిన ఏపీ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను నగరంలోని హరనాధపురంలో గల ఆయన నివాసంలో మంత్రులు ఎన్ఎండి ఫరూక్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు నిలవల విజయశ్రీ, కొండబాబు, మారిటైం బోర్డ్ ఛైర్మన్ దామచర్ల సత్య తదితరులు పరామర్శించారు.

# పక్షవాతంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్థిక సాయం..!

ఉదయగిరి (చైతన్యరథం): కొండాపురం మండలం తూర్పు యర్రబల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ కార్యకర్త పాశం హాజరత్తయ్య పక్షవాతంతో బాధపడుతూ, కాలు చచ్చుపడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక నాయకులు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మానవత్వంతో స్పందించి, బాధిత కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరటనందించేందుకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.15 వేల రూపాయలను తక్షణ సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు ఎలాంటి కష్టసమయంలో ఉన్నా తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



## ఆర్డీటీకి కష్టం వస్తే.. అది జిల్లా ప్రజలకు కష్టం వచ్చినట్టే

**●ఈ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి రానివ్వం : పరిటాల శ్రీరామ్**



అనంతపురం (చైతన్యరథం): అనంతపురం జిల్లాకు జీవనాడి లాంటి ఆర్డీటీకి కష్టం వస్తే.. ప్రజలకు కష్టం వచ్చినట్టేనని.. దానిని ఈ ప్రభుత్వం రానివ్వదని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా సంస్థ నిర్వహణపై చాలా మందికి ఆందోళన ఉండేదని.. కానీ వాటన్నింటినీ కేంద్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. ఇది జిల్లా ప్రజలకు ఒక పండుగ లాంటి రోజన్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి వలనే సాధ్యమైందన్నారు. ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ ఆగినప్పుడు తాము ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు వారు ఈ ప్రాంత ప్రజలకంటే ఎక్కువగా ఆలోచించారన్నారు. ఇది వారి బాధ్యతగా.. ఆర్డీటీ అంటే అభిమానంతో సమస్యను పరిష్కరించేలా చొరవ చూపారన్నారు. ఢిల్లీలో మన ఎంపీలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి అడ్డంకుల్ని తొలగిస్తూ వచ్చారన్నారు. ప్రధానమంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షాను కలిసి సమస్యను వివరించి ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ సాధించారన్నారు. 1970కాలం నుంచి ఫాదర్ ఫెర్రర్ జిల్లా ప్రజలకు అందించిన సేవల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, క్రీడలు, వ్యవసాయం, గృహ నిర్మాణంలో లక్షల మందికి సాయం చేశారన్నారు. ఓ విధంగా ఇది జిల్లాకు జీవనాడిగా మారిందన్నారు. అలాంటి సంస్థకు కష్టం వస్తే... ఈ ప్రభుత్వం కూడా అలానే స్పందించిందన్నారు. అనేక ప్రయత్నాల తర్వాత ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ కావడం పట్ల జిల్లా ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## 2022లోనే ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ సమస్య వచ్చింది

**●ఆ రోజే వైసీపీ స్పందించి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదు**

**●మంత్రి నారా లోకేష్ కృషి వలనే ఇది సాధ్యమైంది**

**●ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ శ్రీరామనవమి కానుకన్న దగ్గుపాటి**



అనంతపురం (చైతన్యరథం): ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ సమస్య 2022లోనే వచ్చిందని.. ఆ రోజే వైసీపీ నాయకులు సరిగా స్పందించి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆర్.అండ్.బి అతిథి గృహంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ... ఆర్డీటీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సేవలందిస్తున్న సంస్థ అన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణాలు, క్రీడల్లో అనేక సేవలందించారన్నారు. విన్సెంట్ ఫెర్రర్ దగ్గర నుంచి మాంఛో ఫెర్రర్ వరకు వారు చేసిన కార్యక్రమాలు వెలకట్టలేనివన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నుంచే ఆర్డీటీకి నిధులు రాకుండా ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ వారు ఏ రోజు దీని గురించి పట్టించుకోలేదన్నారు. ఈ 20 నెలల కాలంలో జిల్లా ఎమ్మెల్యేలు రాష్ట్రంలో ఎంపీలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన సమయంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా ఒక హామీ ఇచ్చారని... ఇచ్చిన హామీ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా తో మాట్లాడి ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేయించారన్నారు. మరో ఐదేళ్లపాటు విదేశీ నిధులు రావడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. ఆర్డిటీ సేవలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. వైసిపి నేతలు కేవలం జిల్లాలో పాదయాత్రలు నిరసనలు అంటూ షో చేశారు కానీ.. అవి జిల్లా దాటి కూడా పోలేదన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ వలనే ఇది సాధ్యమైందన్నారు. ఇక నుంచి ఆర్డీటీకి మరింత సహకారం అందిస్తామని మంత్రి నారా లోకేష్ చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం మా తెలుగు రాష్ట్రాల ప్రజలకు శ్రీరామ నవమి సందర్భంగా అందించిన కానుకగా ఇది భావిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

**● పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన పుత్తా నరసింహారెడ్డి**



కమలాపురం (చైతన్యరథం): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం కొలుమలపల్లి పంచాయతీ లక్కిరెడ్డిపల్లిలో రూ.24 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభొఇంచారు. గ్రామానికి 60 సంవత్సరాలు ఉన్న స్మశానవాటికి వెళ్లే రహదారిని పరిష్కరించి సిమెంట్ రోడ్డును నిర్మించారని ఈ విషయంలో పుత్తా నరసింహారెడ్డి సహకారం ఎప్పటికి మర్చిపోలేమని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనిగానిపల్లి గ్రామస్తులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎం.ఎస్.రాజు

**●ఇటీవల గ్రామాల పర్యటనల సందర్భంగా బోరు అడిగిన గ్రామస్తులు**

**●రోజుల వ్యవధిలోనే హామీని నెరవేర్చడంతో గ్రామస్తుల్లో ఆనందం**

**●ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపిన మైనిగానిపల్లి గ్రామస్తులు**



మడకశిర (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గం, గుడిబండ మండలం, రాళ్లపల్లి పంచాయతీ, మైనిగానిపల్లి గ్రామస్తులకు స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు మరియు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు ఇచ్చిన హామీని రోజుల వ్యవధిలోనే నెరవేర్చారు. ఇటీవల నియోజకవర్గవ్యాప్తంగా బైకుపై ప్రయాణించి, ప్రజలతో మమేకమై, వారి సమస్యలు తెలుసుకున్న ఎం.ఎస్.రాజుకి మైనిగానిపల్లి గ్రామస్తులు తాము ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వివరించారు. ఆ సమయంలో త్వరలోనే బోరు ఏర్పాటు చేస్తానని ఎం.ఎస్.రాజు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా ఈరోజు మైనిగానిపల్లి గ్రామంలో బోరు ఏర్పాటు చేశారు. 900అడుగుల్లో నీరు లభించడంతో గ్రామస్తుల్లో ఆనందం నెలకొంది. ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మేరకు కొత్త బోరు ఏర్పాటుతో మైనిగానిపల్లి ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గొల్లహట్టి కాలనీ ప్రజలకు నీటి సమస్య పరిష్కారమైంది. తాము అడిగిన రోజుల వ్యవధిలోనే బోరు ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న వేసవిలో తమ నీటి కష్టాలు తీరబోతున్న తరుణంలో సంతోషం వ్యక్తం చేశారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె



పుట్టపర్తి (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఆమడగూరు మండలం పూలకుంటపల్లి, గోపాల్‌నాయక్ తాండ, లోకోజుపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను రైతులకు వివరించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గం చూపారు. కూటమి ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని, ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

## అర్డీటీ సంస్థకు ఎలాంటి ఆటంకాలు ఉండవు : పరిటాల సునీత



రాప్తాడు (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి వలనే ఆర్డీటీ సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ జరిగిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్‌కి ఆమోదం తెలపడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గత 50ఏళ్లుగా ఆర్డీటీ సంస్థ జిల్లాలో అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. వేలాది మంది పేదల జీవితాల్ని మార్చిన సంస్థ ఆర్డీటీ అన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం, క్రీడల్లో వారు చేసిన సేవలు ప్రభుత్వంతో సమానంగా ఉన్నాయన్నారు. అలాంటి సంస్థకు గత ప్రభుత్వ హయాం నుంచి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇది తమ దృష్టికి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లను కలిసి పరిస్థితి వివరించామన్నారు. జిల్లా ఎమ్మెల్యేలంతా ఢిల్లీకి వెళ్లగా అక్కడ ప్రత్యేకంగా ఒక ఎంపీని నియమించి.. ఆర్డీటీ ఫైల్ ను ముందుకు కదిలేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలిచ్చారన్నారు. ఆ తర్వాత మంత్రి నారా లోకేష్ కూడా దీనిపై బలంగా నిలబడ్డారన్నారు. తాము ఆయన దృష్టికి సమస్య తీసుకెళ్లినప్పుడు మీరంతా ధైర్యంగా ఉండాలని.. కచ్చితంగా ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ తీసుకొస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన పలుసార్లు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాను కలిసి పరిస్థితిని వివరించారన్నారు. ఇప్పుడు రెన్యూవల్‌గా అనుమతులు రావడంతో జిల్లా ప్రజల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. దీని కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రత్యేకంగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో ఆర్డీటీ సంస్థకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.


## మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి (చైతన్యరథం): ముప్పాళ్ల గ్రామం, ఎంఈఓ ఆఫీస్ ప్రాంగణంలో కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారిచే నిర్వహించబడిన మెగా వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం కన్నా మాట్లాడుతూ.. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మెడిసిన్ అందజేస్తారని నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేయడం జరిగిందని, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే పేదలకు ప్రభుత్వం అండగా నిలిచి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటుందన్నారు. వైసీపీ పాలనలో పేదల ఆరోగ్యాన్ని గాలికొదిలేశారని, దోచుకోవడమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగిందన్నారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. అడిగిన వెంటనే ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు బసవతారకం హాస్పిటల్ వారికి, డాక్టర్లకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రజల జీవనరేఖ

# ఆర్డీటీ



భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా స్పెయిన్ దేశానికి చెందిన విన్సెంట్ ఫెర్రర్ 1969లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)ని ప్రారంభించారు. ఇది పిల్లలు, మహిళలు, దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన విద్య, ప్రాథమిక ఆరోగ్య సేవలు, ఆసుపత్రుల సౌకర్యం, గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. క్రీడల ద్వారా పిల్లలు, యువత లోని పూర్తి సామర్థ్యాన్ని వెలికితీస్తోంది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని దాదాపు 3,877 గ్రామాలకు ఆర్డీటీ తన సేవా కార్యక్రమాలను విస్తరించింది. వేలాది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది.

# ఆర్డీటీకి జీవం పోశారు

**చంద్రబాబు, లోకేష్‌లకు మాంచో ఫెర్రర్ కృతజ్ఞతలు**



**పేదల పెదవులపై చిరునవ్వు**
**ఆర్డీటీకి తొలగిన అడ్డంకులు**
**మాటిచ్చి నెరవేర్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్**



ఉండవల్లి (చైతన్యరథం): పేదోడి నోటికాడ ముద్ద... నిరుపేదలకు అందని చదువులను అందించిన విద్యాలయం... పైసలులేని వారికి రోగమొస్తే నయంచేసే ఆరోగ్యాలయం... చిన్నారుల చిద్విలాసం.. తెలుగు రాష్ట్రాల వెలుగు కిరణం... అయిన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్‌కి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చొరవతో అడ్డంకులన్నీ తొలగాయి. లక్షలాది ప్రజల ఆశాజ్యోతి ఆర్డీటీని రక్షించుకుంటామని మాటిచ్చిన మంత్రి నారా లోకేష్ అసాధ్యం అనుకున్న పనిని తనదైన శైలి మంత్రాంగంతో సుసాధ్యం చేశారు. కేంద్రంతో మాట్లాడి ఆర్డీటీకి అడ్డంకులు తొలగించారు. ఈ నేపథ్యంలో ఆర్డీటీ నిర్వాహకుడు మాంచో ఫెర్రర్ మంగళవారం ఉండవల్లిలోని మంత్రి నివాసానికి విచ్చేసి నారా లోకేష్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇది ఆర్డీటీ ఒక మంత్రికి చెబుతున్న కృతజ్ఞతలు కాదు... ఆర్డీటీ తరఫున లక్షలాది ప్రజలు మంచిపని చేసిన మంచి మనిషికి అందిస్తున్న ఆశీస్సులు అని చెప్పారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ...



నిస్వార్థంగా దశాబ్దాలుగా తెలుగు ప్రజలకు విద్య, వైద్య, ఉపాధి, శిక్షణ ద్వారా ఆర్డీటీ అందిస్తున్న సేవలు ముందు తాను చేసిన పని చాలా చిన్నదని అన్నారు. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ కింద స్వచ్ఛంద సంస్థలకు విదేశాల నుంచి వస్తున్న నిధులను నిలిపివేస్తూ కేంద్రం గతంలో ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆర్డీటీకి నిధులు ఆగిపోయాయి. ఈ విషయాన్ని గతంలోనే లోకేష్ దృష్టికి ఫెర్రర్ తీసుకొచ్చారు. తానున్నానని అభయమిచ్చిన లోకేష్ కేంద్ర పెద్దలతో మాట్లాడారు. "లక్షల మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఆశాకిరణం ఆర్డీటీ. ఈ ట్రస్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ. ట్రస్టు సేవలు నిరంతరం కొనసాగించేందుకు పూర్తిస్థాయి ప్రయత్నం చేస్తాం" అని ఫెర్రర్‌కు, ప్రజలకు ఇచ్చిన మాటను లోకేష్ నిలబెట్టుకున్నారు. సున్నితమైన సమస్యను సమయస్ఫూర్తిగా పరిష్కరించారు. ఆర్డీటీకి విదేశాల నుంచి నిధుల రాకకు మార్గం సుగమం చేశారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి.



## తల్లిదండ్రుల ఆశయ సాధనలో

# మాంచో ఫెర్రర్



ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్-అన్నా ఫెర్రర్ దంపతుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో వారి కుమారుడు మాంచో ఫెర్రర్ విశేష కృషి చేస్తున్నారు. భారతదేశంలో జన్మించిన ఆయన బ్రిటన్‌లోని కీలక విశ్వవిద్యాలయం నుంచి అంతర్జాతీయ సంబంధాలలో పట్టా పొందారు. 2017లో ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫోర్డ్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తన విద్యను, విజ్ఞానాన్ని పేదల అభ్యున్నతికే అంకితం చేస్తూ వృత్తిపరమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. 2002లో అసోసియేట్ ప్రోగ్రాం మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన మాంచో 2010లో తండ్రి విన్సెంట్ ఫెర్రర్ మరణానంతరం తల్లి అన్నా ఫెర్రర్‌తో కలిసి సంస్థకు వ్యూహాత్మక దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆర్డీటీని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లారు.



**నార్వే రాజధాని ఓస్లో నగరం తెలుగు సంస్కృతీ సౌరభాలతో పులకించిపోయింది. నార్వే తెలుగు సంఘం పదేళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించిన సందర్భంగా నిర్వహించిన 'దశాబ్ది ఉత్సవాలు-ఉగాది సంబరాలు 2026' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పరాయి గడ్డపై మన భాషను, సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న ప్రవాస తెలుగు వారి కృషి ఈ వేడుకల్లో అడుగడుగునా కనిపించింది.**




ఓస్లో తీరంలో..

# తెలుగు తరంగం

- నార్వే తెలుగు సంఘం పదేళ్ల ప్రస్థానం
- అంబరాన్నంటిన 'దశాబ్ది ఉత్సవాలు'
- ప్రవాస భారతీయులపై ముఖ్య అతిథుల ప్రశంసల జల్లు
- శుభాకాంక్షల సందేశాలు పంపిన భారతీయ ప్రముఖులు

**ఓస్లో (నార్వే):** నార్వే రాజధాని ఓస్లో నగరంలో తెలుగు వెలుగులు విరజిమ్మాయి. నార్వే తెలుగు సంఘం (NTA) పదేళ్ల మైలురాయి చేరుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 'దశాబ్ది ఉత్సవాలు-ఉగాది సంబరాలు 2026' పేరుతో నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. సుమారు 350 మందికి పైగా ప్రవాస తెలుగు కుటుంబాలు పాల్గొని పరాయి గడ్డపై మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు.

ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి నార్వేలోని ప్రముఖ రాజకీయ నేతలు, భారత దౌత్యవేత్తలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అకెర్షస్ కౌంటీ డిప్యూటీ మేయర్ ఓలే జాకబ్ జోహన్సెన్, భారత రాయబార కార్యాలయ ప్రతినిధి ఎస్. మాగేష్‌కుమార్, ఆస్కర్ మేయర్ లెనె కాన్రాడి... ప్రవాస భారతీయులు వారి మూలాలను మర్చిపోకుండా చేస్తున్న కృషిని అభినందించారు.

భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు నార్వే తెలుగు సంఘం ప్రయాణాన్ని కొనియాడుతూ శుభాకాంక్షల సందేశాలు పంపించారు. ఇది అక్కడి వారికి ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది.

వేదికపై జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్టాక్‌హోమ్ నుంచి వచ్చిన అలెన్ స్కూల్ ఆఫ్ డాన్సెస్ బృందం, డాక్టర్ సరళకుమారి కూచిపూడి నృత్యం, ముద్ర డాన్స్ అకాడమీ సభ్యుల ప్రదర్శనలు వేడుకకు నిండుదనాన్ని ఇచ్చాయి. ఇవి



కేవలం వినోదం మాత్రమే కాకుండా మన కళల గొప్పదనాన్ని చాటాయి.

నార్వే తెలుగు సంఘం పదేళ్ల ప్రయాణంలో వెన్నంటి నిలిచిన పాత కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. వారికి మెమెంటోలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. సుదూర ప్రాంతంలో





ఉంటూ కూడా మన భాషను, పండుగలను కాపాడుకుంటూ వస్తున్న ఎన్‌టీఏ సభ్యుల కృషిని అతిథులు మనస్ఫూర్తిగా ప్రశంసించారు. చివరగా తెలుగు వారి విందు భోజనంతో వేడుక ఘనంగా ముగిసింది.

# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

### యుద్ధం పరిణామాలపై చర్చించుకున్న నేతలు - ఎక్స్‌లో వెల్లడించిన భారత్‌లో అమెరికా రాయబారి





అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేసారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. అలాగే, హర్మూజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపైనా చర్చించినట్టు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ ఏడాదిలో ప్రధాని మోదీతో ట్రంప్ టెలిఫోన్ సంభాషణ జరపడం ఇది రెండోసారి. అయితే, ఇరాన్‌లో విద్యుత్కేంద్రాలు, ఇంధన మౌలికసదుపాయాలపై ఐదు రోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారం ప్రకటించిన మరుసటిరోజే నేరుగా ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. పశ్చిమాసియాలో పరిణామాలు, ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు, యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఇరువురు నేతలమధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. భారత్‌ది ఎప్పుడూ శాంతి మార్గమేనని, యుద్ధమనేది మానవాళి ప్రయోజనాలకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. ఇరు దేశాలు చర్చల ద్వారానే తమ మధ్య విభేదాలను పరిష్కరించుకోవాలని, ఆ దిశగానే ముందుకెళ్లాలని పార్లమెంటులో నిన్న మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా దేశంలో కొన్ని అనూహ్య పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. గ్యాస్, పెట్రోల్‌వంటి వాటిపై ప్రభావం పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఇరువురు నేతల మధ్య ఫోన్ సంభాషణ కీలకంగా మారింది. అయితే, ఇరాన్ విషయంలో ఇకపై దాడులు కొనసాగడానికి ఆస్కారం లేని పరిస్థితులు ఉండాలని, దానికనుగుణంగా అమెరికా ముందడుగు వేస్తుందనే ఆశాభావాన్ని ప్రధాని మోదీ వ్యక్తం చేసినట్టు సమాచారం.

## చర్చలకు ఇరాన్ నో!



### అమెరికా ప్రతిపాదన యుద్ధవ్యూహమేనని ప్రకటన
### మళ్లీ ఆకాశానికి చేరుతున్న చమురు ధరలు

ఇరాన్ యుద్ధ సంక్షోభం ప్రపంచంలోని అనేక దేశాల్ని ఇబ్బంది పెడుతోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇటీవల కొద్దిగా తగ్గినట్టు కనిపించినా ఇప్పుడు మళ్లీ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బ్యారెల్ క్రూడాయిల్ 4 శాతం.. అంటే 4 డాలర్లు పెరిగి ధర 103.94 డాలర్లకు చేరింది. ఇటీవల 10 శాతం వరకూ తగ్గిన చమురు ధరలు ఇప్పుడు మళ్లీ పెరుగుతున్నాయి. దీనికి కారణం తాజాగా అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న సంక్షోభమే. ఐదు రోజులపాటు ఇరాన్‌పై దాడులు ఆపేస్తామని, ఆ దేశంతో చర్చలు జరుపుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. అమెరికా ప్రతిపాదనను తిరస్కరించినట్టు వెల్లడించిన ఇరాన్.. ఇదంతా మార్కెట్లపై ప్రభావం చూపేందుకు అమెరికా వేసిన ఎత్తుగడలా అభివర్ణించింది. ఇదే సమయంలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. అలాగే, ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌పై దాడి చేస్తోంది. పశ్చిమాసియాలో ఈ సంక్షోభం ఇంకా కొనసాగే అవకాశం ఉండటంతో చమురు ధరలు మరింత పెరుగుతున్నాయి. అమెరికా ఆస్తులే లక్ష్యంగా దాడి చేస్తామని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ ప్రకటించింది.

చమురు సంక్షోభం తొలగాలంటే ఇరాన్ యుద్ధం ముగియాలి. అలాగే, హోర్ముజ్ జలసంధి తెరవాలి. ప్రపంచంలో ఐదోవంతు చమురు ఈ మార్గం ద్వారానే రవాణా అవుతుంది. అయితే, యుద్ధం కారణంగా ఈ రవాణా మార్గాన్ని ఇరాన్ మూసేసింది.

దీంతో చమురు నౌకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా సరఫరా నిలిచిపోవడంతో అనేక దేశాలు చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. హోర్ముజ్ జలసంధి ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో స్పష్టత లేదు. నిజానికి ట్రంప్ యుద్ధానికి విరామం ఇస్తున్నట్టు ప్రకటించడంతో చమురు ధరలు దిగొస్తాయని మార్కెట్ నిపుణులు భావించారు. కానీ, దీనికి ఇరాన్ భిన్నంగా స్పందించడంతో చమురు ధరలు ఇంకా పెరుగుతున్నాయి.

## మళ్లీ 'అమెజాన్'కు అంతరాయం

### గల్ఫ్ దేశాలకు విరుచుకుపడుతున్న ఇరాన్ డ్రోన్లు



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో బహ్రెయిన్‌లోని తమ వెబ్ సర్వీసెస్‌లో అంతరాయం ఏర్పడినట్టు ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పేర్కొంది. ఆ ప్రాంతంలో డ్రోన్ కార్యకలాపాలవల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్టు అమెజాన్ ప్రతినిధి వెల్లడించారు. గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. ఈ ఘటన కారణంగా ఎంత నష్టం వాటిల్లింది, ఎన్ని రోజులపాటు అంతరాయం కొనసాగనుందనే వివరాలను అమెజాన్ వెల్లడించలేదు. దీనినుంచి బయటపడేవరకు వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ప్రాంతాల్లోని వెబ్ సర్వీసెస్లకు మార్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో.. ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారు ఇతర ప్రదేశాలకు తరలివెళ్లాలని తమ ఉద్యోగులకు ఇప్పటికే సూచించినట్టు పేర్కొంది. కాగా.. ఈనెల ప్రారంభంలో బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అమెజాన్ డేటా సెంటర్లపై డ్రోన్ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో తమ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నట్టు నాడు అమెజాన్ పేర్కొంది.

## యుద్ధంలోకి సౌదీ, యుఏఈ?



ఇరాన్ విద్యుత్కేంద్రాలపై దాడులను వాయిదా వేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనవేళ వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనం సంచలనంగా మారింది. టెహ్రాన్‌పై అగ్రరాజ్యం సాగిస్తోన్న యుద్ధంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాల్గొనేందుకు సిద్ధమైనట్టు ఆ కథనం పేర్కొంది. గతంలో తమ వైమానిక స్థావరాలను అమెరికా సైన్యం ఉపయోగించుకొనేందుకు అనుమతించని సౌదీ అరేబియా.. ప్రస్తుతం అందుకు అంగీకరించినట్టు ఆ కథనం తెలిపింది. మరోవైపు, యూఏఈ ఇరాన్‌కు చెందిన ఓ ఆసుపత్రిని, క్లబ్‌ను మూసివేసింది. దీంతో టెహ్రాన్‌తో సంబంధమున్న సహాయ నెట్‌వర్క్ ఆటంకం కలిగిందని వాల్ట్ జర్నల్ పేర్కొంది. ఈ పరిణామాలు చూస్తుంటే.. యుద్ధం విషయంలో అమెరికాకు సౌదీ, యూఏఈ ప్రత్యక్షంగా సాయం చేసే అవకాశాలు కన్పిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఇరాన్‌పైకి దూసుకెళ్లిన కొన్ని క్షిపణులు బహ్రెయిన్ నుంచే ప్రయోగించినట్టు వీడియోలు బయటికొచ్చాయి. పశ్చిమాసియాలో సుదీర్ఘంగా జరుగుతున్న దాడులవల్ల తమ ఆర్థికవ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉందని గల్ఫ్ దేశాలు భావిస్తున్నాయి. దీనికితోడు హర్మూజ్ జలసంధిని ఇరాన్ నియంత్రించడంపైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పర్షియన్ గల్ఫ్‌లోని అమెరికా మిత్రదేశాలు.. యుద్ధంలో అగ్రరాజ్యానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు సదరు కథనం పేర్కొంది. అయితే, ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించలేదు.


## ట్రంప్ దూకుడుపై కిమ్ గుస్సా



ఇరాన్‌పై దాడి చేసిన అమెరికా దూకుడు వైఖరిని ఉత్తర కొరియా నేత కిమ్ జాంగ్ ఉన్ తప్పుపట్టారు. సోమవారం పార్లమెంట్‌లో మాట్లాడుతూ తమ దేశం సమకూర్చుకుంటున్న అణ్వాయుధాలను ఆయన సమర్థించుకున్నారు. కిమ్ ప్రసంగానికి చెందిన అంశాలను మంగళవారం ఆ దేశ మీడియా రిలీజ్ చేసింది. దేశంలో అన్ని రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు కిమ్ చెప్పారు. సైన్యం, భద్రత అంశంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. ఇరాన్‌లో కొనసాగుతున్న అమెరికా దాడుల గురించి ప్రస్తావిస్తూ.. సార్వభౌమ దేశాల హక్కులను అగ్రరాజ్యం కాలరాస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తమ ప్రాంత సుస్థిరత, శాంతి కోసం అణ్వాయుధాల సమీకరణ అవసరమన్నారు. కిమ్ తన ప్రసంగంలో నేరుగా ట్రంప్ పేరును ప్రస్తావించలేదు. కానీ, అమెరికా ప్రభుత్వం ఉగ్ర దాడులకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా దూకుడుగా వ్యవహరిస్తోందన్నారు. ఇరాన్‌తో ఫలప్రదంగా చర్చలు జరుగుతున్నట్టు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. సమరమైనా, సంధి అయినా, ఆ నిర్ణయం అమెరికా చేతుల్లోనే ఉందన్నారు.

## టెక్సాస్ రిఫైనరీలో భారీ పేలుడు

### మైళ్లదూరం భూమి కంపించిందన్న స్థానికులు



అమెరికాలోని ఓ ఆయిల్ రిఫైనరీలో భారీ పేలుడు సంభవించింది. టెక్సాస్‌లోని పోర్ట్ ఆర్థర్‌లో ఉన్న వలెరో రిఫైనరీలో ఈ ఘటన చోటుచేసుకుంది. భారీఎత్తున మంటలు వ్యాపించాయి. దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్ముకుంది. పేలుడు సమయంలో భారీ శబ్ధం వినిపించినట్టు స్థానికులు చెబుతున్నారు. కొన్ని మైళ్ల దూరం వరకు భూమి కంపించినట్టు చెబుతున్నారు. పోర్ట్ ఆర్థర్‌లో అప్రమత్తత ప్రకటించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డవారి గురించి ఇంకా ఎటువంటి సమాచారం లేదని జెఫర్‌సన్ కౌంటీ షరీఫ్ జీనా స్టీఫెన్స్ తెలిపారు.

ఏ కారణం చేత పేలుడు సంభవించిందో ఇంకా నిర్ధారించలేకపోయినట్టు పోర్ట్ ఆర్థర్ ఫైర్ డిపార్టమెంట్ చీఫ్ ఆంటోనియో మిచెల్ పేర్కొన్నారు. టెక్సాస్ గల్ఫ్ కోస్టులో ఉన్న రిఫైనరీల్లో వలెరో అతిపెద్దది. ఇక్కడ నిత్యం సుమారు నాలుగున్నర లక్షల బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను రిఫైన్ చేస్తారు. ఇరాన్‌పై దాడివల్ల ప్రస్తుతం అమెరికాలో ఇంధన ధరలు ఆకాశాన్ని అంటాయి. ఇక పోర్ట్ ఆర్థర్ రిఫైనరీ పేలుడు ఘటనతో పరిస్థితి మరింత తీవ్రం కానున్నట్టు భావిస్తున్నారు.

## షెడ్యూల్ ప్రకారమే లీగ్..

# బీసీసీఐ సరికొత్త నిబంధనలు!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026.. మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. మార్చి 28న ఆర్సీబీ-ఎస్ఆర్ హెచ్‌తో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. టోర్నీ ఆరంభానికి ముందే జట్లు పాటించాల్సిన ప్రాక్టీస్ సెషన్లు, పిచ్ నిర్వహణకు సంబంధించి కఠిన మార్గదర్శకాలను విడుదల చేసింది.

**ప్రాక్టీస్ సెషన్ రూల్స్..**

ఒక జట్టు ఉపయోగించిన పిచ్‌లు, నెట్స్‌లను ఇతర జట్లు ఉపయోగించకూడదు. ప్రతి సెషన్‌కు తాజాగా సిద్ధం చేసిన పిచ్‌లను తప్పనిసరిగా అందించాలి. మ్యాచ్ జరిగే రోజు ప్రాక్టీస్ కు అనుమతి లేదు. ప్రధాన ప్రాంగణంలో ఎలాంటి ఫిట్‌నెట్ టెస్ట్ జరగదు. ప్రాక్టీస్ రోజుల్లో గుర్తింపు పొందిన సిబ్బందిని మాత్రమే డ్రెస్సింగ్ రూమ్, మైదానంలోకి అనుమతిస్తారు. ఆటగాళ్ల కుటుంబసభ్యులు, స్నేహితులు వేరే వాహనంలోనే ప్రయాణించాలి. హాస్పిటాలిటీ ఏరియా నుంచి జట్టు ప్రాక్టీస్‌ను వీక్షించే అవకాశం వీరికి కల్పిస్తారు. త్రో డౌన్ స్పెషలిస్ట్, నెట్ బౌలర్లు వంటి అదనపు సహాయక సిబ్బంది జాబితా వివరాలను బీసీసీఐకి సమర్పించాలి. ఆమోదం పొందిన తర్వాతే వీరికి గుర్తింపు పత్రాలు జారీ చేస్తారు. ఆటగాళ్లు ప్రాక్టీస్‌కు వచ్చేటప్పుడు టీమ్ బస్‌ను మాత్రమే ఉపయోగించాలి.

**మ్యాచ్ డే రూల్స్..**

పీఎంవోఏ నుంచి గుర్తింపు పొందిన సిబ్బంది మ్యాచ్ రోజు తమ ఐడీని తీసుకురావడం తప్పనిసరి. ఆరెంజ్, పర్పుల్ క్యాప్ దక్కించుకున్న ప్లేయర్లు.. అవి మ్యాచ్ సమయంలో కచ్చితంగా ధరించాలి. మ్యాచ్ అనంతరం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఫ్లాపీలు, స్లీవ్ లెస్ జెర్సీలు ధరించేందుకు ఆటగాళ్లకు అనుమతి లేదు. రూల్ పాటించకపోతే తొలిసారి హెచ్చరిక, రెండోసారి జరిమానా విధిస్తారు. ప్లేయర్ల జెర్సీ నంబర్లలో మార్పు ఉంటే.. ఆయా ఫ్రాంచైజీలు నిబంధనల ప్రకారం 24 గంటల ముందే ఆ వివరాలు తెలియజేయాలి.

**షెడ్యూల్ ప్రకారమే లీగ్: ఐపీఎల్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. అయితే పలువురు విదేశీ క్రికెటర్లు ఇంకా తమ జట్లతో చేరలేదు. కొంతమంది గాయాలపాలవ్వడం, మరికొందరు వర్క్‌లోడ్ కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమవుతారనే వార్తలు వస్తున్నాయి. దీనిపై క్రికెట్ మాజీలు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఓ వార్త హల్‌చల్ అవుతోంది. విదేశీ క్రికెటర్లు జట్లతో చేరాల్సి ఉండటంతో ఐపీఎల్‌ను వాయిదా వేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై ఐపీఎల్ వర్గాలు స్పందించాయి. పలు రాష్ట్రాల్లో ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే ఐపీఎల్ నిర్వాహకులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే విదేశీ క్రికెటర్ల కోసం లీగ్‌ను ఆపలేమని ఐపీఎల్ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రణాళిక ప్రకారమే మార్చి 28న టోర్నీ ప్రారంభం అవుతుందని.. సీజన్ మొత్తం జరుగుతుందని వెల్లడించాయి. విదేశీ ఆటగాళ్ల విషయం ఫ్రాంచైజీలే చూసుకుంటాయని ఐపీఎల్ వర్గాలు పేర్కొంటున్నాయి. 'మెగా లీగ్‌లో విదేశీ క్రికెటర్లు ఆడే విషయంలో ఫ్రాంచైజీలదే తుది నిర్ణయం. ఇందులో మేం చేసేదేమీ లేదు. కొందరు గాయాల కారణంగా ఇంకా తమ జట్లతో చేరలేదు. మరికొందరు వర్క్‌లోడ్‌తో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండరు. వారి లభ్యతను ఫ్రాంచైజీలే చూసుకుంటాయి. ఐపీఎల్ మాత్రం షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది. పూర్తిస్థాయిలో అభిమానులు హాజరై ఆస్వాదించేలా చర్యలు తీసుకున్నాం' అని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి.

## తొక్కిసలాట మృతులకు నివాళిగా కీలక నిర్ణయం

# 11 మందికి గుర్తుగా 11 సీట్లు



గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. వారికి నివాళిగా ఆర్సీబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చిన్నస్వామి స్టేడియంలో జరగనున్న తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ ప్లేయర్లు 11వ నంబర్ జెర్సీలు ధరించనున్నారు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ సీఈవో రాజేశ్ మేనన్ వెల్లడించారు. అలానే ఆర్సీబీ మరో నిర్ణయం కూడా తీసుకుంది. కర్ణాటక అసోసియే షన్(కేఎస్‌సీఏ) సహకారంతో చనిపోయిన 11 మంది అభిమానుల పేర్ల మీద చిన్నస్వామి స్టేడియంలో శాశ్వత సీట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తులో చిన్నస్వామి స్టేడియంలో జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌లతో సహా అన్ని ఈవెంట్లలో ఈ సీట్లు ఖాళీగానే ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. అలానే తొలి మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద 11మంది అభిమానుల మృతుల జ్ఞాపకార్థం ఒక స్మారక ఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. మంగళవారం ఆర్సీబీ సీఈవో రాజేశ్ మాట్లాడుతూ 'మ్యాచ్ రోజున ప్రాక్టీస్ సమయంలో ఆటగాళ్లందరూ 11వ నంబర్ జెర్సీని ధరిస్తారు. ఇది మాతోనే నడిచిన మా అభిమానులకు మేము అర్పించే నివాళి. అలానే తొలి మ్యాచ్ రోజు ఆటగాళ్లంతా నల్లని కళ్లద్దాలను కూడా ధరిస్తారు. చిన్నస్వామి స్టేడియంలో 11 సీట్లను శాశ్వతంగా కేటాయించాలని మేము భావిస్తున్నాము. ఎప్పటికీ మాకు తోడుగా నిలిచే ఆ 11 మంది అభిమానుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం' అని రాజేశ్ మీనన్ పేర్కొన్నారు. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్సీబీ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. 18 ఏళ్ల నిరీక్షణ ఫలించడంతో జూన్ 4న బెంగళూరులో ఆర్సీబీ విజయోత్స వేడుక నిర్వహించింది. ఈ విజయోత్స వేడుకలను చూసేందుకు అభిమానులు లక్షల్లో తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం బయట తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోగా.. 50 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటన అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

## ప్రభుత్వ ఉద్యోగిగా మారిన రింకు



టీమిండియా పవర్ హిట్టర్, టీ20 ప్రపంచ కప్ 2026 విజేత రింకు సింగ్‌కు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. అతడిని రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా యోగి సర్కార్ నియమించింది. ఈ మేరకు మంగళవారం లఖ్‌నవూలోని లోక్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నియామ పత్రాన్ని రింకుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ అందజేశారు. పొట్టి ప్రపంచం కప్ సమయంలోనే రింకు తండ్రి మరణించిన సంగతి తెలిసిందే. అంతటి విషాదంలో ఉండి కూడా తండ్రి అంత్యక్రియలు ముగిసిన వెంటనే తిరిగి జట్టుతో చేరి తన అంకితభావాన్ని చాటుకున్నాడు. రింకు టీ20 ప్రపంచ కప్ 2026లో మొత్తం 5 ఇన్నింగ్స్‌లో 24 పరుగులు మాత్రమే చేశాడు. ఈ అన్ని మ్యాచ్‌లలో అతడు ఆఖరిలో బ్యాటింగ్‌కు వచ్చాడు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 4 బంతుల్లోనే 11 పరుగులు చేశాడు. ప్రపంచ కప్ 2026లో అతడి అంకితభావానికి గుర్తింపుగా యోగి ప్రభుత్వం ఈ ఉద్యోగంతో సత్కరించింది. రింకు సింగ్ పొందిన పోస్ట్ గ్రూప్-ఏ కిందికి వస్తుంది. జీతం, అలవెన్సులతో కలిపి రూ. 70,000 వరకు చేతికి అందుతుంది. ఇక రింకు సింగ్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన మరో ఐదుగురు అథ్లెట్లకు కూడా యూపీ ప్రభుత్వం ఉద్యోగాలను ప్రకటించింది. రాజ్‌కుమార్ పాల్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (పారా హైజంప్), అజిత్ సింగ్, సిమ్రాన్‌లను కూడా గ్రూప్-1లో వివిధ పోస్టుల్లో యూపీ ప్రభుత్వం నియమించింది. 2024-25 సంవత్సరానికి గాను తొమ్మిది మంది క్రీడాకారులకు రాష్ట్ర అత్యున్నత పురస్కారా లైన లక్ష్మణ్ అవార్డు, రాణి లక్ష్మీబాయి అవార్డులను అందజేశారు. వీరికి రూ. 3.11 లక్షల నగదు బహుమతితో పాటు కాంస్య విగ్రహాన్ని బహూకరించారు.

**లక్ష్మణ్ అవార్డు గ్రహీతలు:**

ఉత్తమ్ సింగ్ (ఘాజీపూర్) – హాకీ
వినయ్ (వారణాసి) – పారా పవర్ లిఫ్టింగ్
అభిజీత్ కుమార్ (ప్రయాగ్రాజ్) – జిమ్నాస్టిక్స్
విక్రాంత్ బలియన్ (మీరట్) – రెజ్లింగ్
సాగర్ దాంగి (బాగ్‌పత్) – షూటింగ్

**రాణి లక్ష్మీబాయి అవార్డు గ్రహీతలు**

భాను పాఠక్ (గోరఖ్‌పూర్) – పర్వతారోహణ
దీపక్ కుమార్ (ఘజియాబాద్) – పర్వతారోహణ
తాన్యా చౌదరి (సహారన్‌పూర్) – అథ్లెటిక్స్
తనుశ్రీ పాండే (లఖ్‌నవూ ) – సాఫ్ట్ టెన్నిస్
ఓం యాదవ్ – సాఫ్ట్ టెన్నిస్
రాజ్‌కుమార్ పాల్ (ఘాజీపూర్) – హాకీ
యష్ కుమార్ (ఆగ్రా) – పారా కానోయింగ్
ముస్కాన్ యాదవ్ (ప్రయాగ్రాజ్) – సాఫ్ట్ టెన్నిస్

# పాక్‌కు షాక్ ఇచ్చేందుకు సిద్ధమైన బంగ్లాదేశ్!



పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వెన్నుపోటు పొడిచేలా కనిపిస్తుంది. బంగ్లా మంత్రి చేసిన వ్యాఖ్యలు వార్తకు బలం చేకూరుస్తున్నాయి. భద్రతా కారణాలతో పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్ 2026) టోర్నీకి తమ ఆటగాళ్లను దూరంగా ఉంచాలనే యోచనలో బీసీబీ ఉన్నట్లు సమాచారం. టీ20 ప్రపంచకప్ 2026 సమయంలో తమకు అండగా నిలిచిన పాక్‌కు బంగ్లాదేశ్ ఇలా దిమ్మతిరిగే షాక్ ఇచ్చేందుకు రెడీ అయ్యింది. పీఎస్ఎల్ 2026 సీజన్‌లో పాల్గొనేందుకు బంగ్లాదేశ్‌కు చెందిన ముస్తాఫిజుర్ రెహ్మాన్, పర్వేజ్ హొస్సైన్, షోరిఫుల్ ఇస్లాం, నహిద్ రాణా, తంజిద్ హసన్ తమీమ్, రిషాద్ హొస్సైన్‌కు బీసీబీ నిరభ్యంతర పత్రాలను(ఎన్ఓసీ) మంజూరు చేసింది. కానీ అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధంతో ప్రస్తుతం నెలకొన్న అస్థిర పరిస్థితుల కారణంగా బంగ్లా ప్రభుత్వం తమ ఆటగాళ్లను పంపేందుకు సంకోచి స్తోంది. 'మా ఆటగాళ్ల భద్రత విషయంలో చిన్నపాటి సందేహం ఉన్నా.. వారిని పాకిస్థాన్‌కు పంపబోము. దీనిపై ముందుగా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పూర్తి విశ్లేషణ చేసి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత జాతీయ భద్రతా సంస్థల సలహా మేరకు ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది' అని బంగ్లాదేశ్ క్రీడా శాఖ మంత్రి అమినూల్ హక్ స్పష్టం చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా పాక్‌లో ఇంధన కొరత ఏర్పడింది. దీంతో ఇంధన, భద్రతా కారణాలతో పీఎస్ఎల్ 2026ను ప్రేక్షకుల్లే కుండా కేవలం కరాచీ, లాహోర్ మైదానా ల్లోనే నిర్వహిస్తామని పీసీబీ ప్రకటించింది. లీగ్ మ్యాచ్‌లకు ప్రేక్షకులను అనుమతిం చమని స్పష్టం చేసింది. ఈ ప్రకటనతో పీఎస్ఎల్ ఆడేందుకు విదేశీ ఆటగాళ్లు సంకోచిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగి న పొట్టి ప్రపంచ కప్ సమయంలో బంగ్లాదేశ్‌కు అండగా నిలిచిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇప్పుడు ఆ దేశ క్రికెట్ బోర్డు మొండి చెయ్యి చూపించేందుకు సిద్ధమైంది. దాంతో పీసీబీపై పాకిస్థాన్ ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మే26 నుంచి పీఎస్ఎల్ ప్రారంభం కానుంది. మరి.. బంగ్లా హ్యాండ్ ఇస్తుందా?, షేక్ హ్యాండ్ ఇస్తుందా తెలియాలంటే..మరికొన్ని గంటలు ఆగాల్సిందే.

# అదుర్స్-2 లేనట్టే!




టాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్‌చేసిన స్టార్ డైరెకర్ల లిస్టులో టాప్‌లో ఉంటాడు వివి వినాయక్. చిరంజీవి, ఎన్టీఆర్, బాలకృష్ణ, వెంకటేశ్, ప్రభాస్‌తోపాటు లీడింగ్ హీరోలతో సినిమాలు చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచాడు. వివి వినాయక్ ఫిల్మోగ్రఫీలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన సినిమా అదుర్స్. జూనియర్ ఎన్టీఆర్‌లోని అన్ని యాంగిల్స్‌ను వాడుకొని సిల్వర్ స్క్రీన్‌పై ఓవైపు కడుపుబ్బా నవ్విస్తూ.. మరోవైపు యాక్షన్ ఎలిమెంట్స్‌తో దుమ్ముదులిపేశాడు. తారక్ కెరీర్‌లో వన్ ది బిగెస్ట్ హిట్‌గా నిలిచిన అదుర్స్ సినిమాను ఎంజాయ్ చేయని మూవీ లవర్ ఉండరంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ క్రేజీ సినిమాకు సీక్వెల్ ఎప్పుడొస్తుందా..? ఇప్పటికే తారక్ అభిమానులతోపాటు సినీజనాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అదుర్స్–2పై ఓ ఈవెంట్‌లో కుండబద్దలు కొట్టేశాడు వివి వినాయక్. పాపులర్ రైటర్ కమ్ ప్రొడ్యూసర్ కోన వెంకట్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. నిజంగా చెప్పాలంటే అదుర్స్ సినిమా అక్కడితో పూర్తయ్యిందన్నాడు వివి వినాయక్. అంతేకాదు అదుర్స్‌లో ఇక సీక్వెల్ తీసేందుకు ఏమీ మిగలలేదన్నాడు. ఒకవేళ బలవంతంగా సీక్వెల్ తీసినా, మళ్లీ అంత గొప్పగా చేయగలమనే నమ్మకం నాకు లేదు. దాన్ని అలాగే వదిలేయడం మంచిదని చెప్పుకొచ్చాడు. వివి వినాయక్ చేసిన ఈ కామెంట్స్‌తో ఇక అదుర్స్–2 ఉండదని క్లారిటీ ఇచ్చేసినట్టయ్యింది

# ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో..



కీరవాణి కుమారుడు కాలభైరవ త్వరలో ఇంటివాడు కానున్నాడా? ఈ ఫ్రేమ్‌లోని సారాంశం అదే. 'బలగం' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న యువ నటి కావ్య కళ్యాణ్ రామ్‌తో కాలభైరవ ప్రేమలో ఉన్నట్టు నెట్టింట వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. 'ఉస్తాద్' సినిమాతో మొదలైన పరిచయం.. క్రమంగా ప్రేమగా మారిందని తెలుస్తోంది. గత కొంతకాలంగా వీరిద్దరూ రహస్యంగా డేటింగ్‌లో ఉన్నారని, ఆ బంధాన్ని పెళ్లివరకూ తీసుకెళ్లే నిర్ణయానికి వచ్చారన్న కథనాలు వినిపిస్తున్నాయి. వీరి ప్రేమ వ్యవహారానికి ఇరు కుటుంబాల పెద్దలూ క్లియరెన్స్ ఇచ్చారని తెలుస్తోంది. కీరవాణి చిన్న కుమారుడు శ్రీసింహా వివాహం ఇప్పటికే జరగడంతో, ఇప్పుడు పెద్ద కుమారుడు కాలభైరవ పెళ్లి పనులపై దృష్టి సారించినట్టు సినీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మరోవైపు రీసెంట్‌గా వీరిద్దరూ కలిసి ఒక పుస్తకావిష్కరణ ఈవెంట్‌కి హాజరుకావడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ప్రేమ, పెళ్లి వార్తలపై కాలభైరవ కానీ, కావ్య కానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది.

# ఆ ప్రచారంలో నిజంలేదు




వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే దర్శకుడు దేవా కట్టా. ఆయన దర్శకత్వంలో అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ నటిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికే ఈ విషయమై 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' సంస్థ స్పందించింది. ప్రస్తుతానికి పవన్ ఏ కొత్త సినిమానీ అంగీకరించలేదని తెలిపింది. తాజాగా దేవా కట్టా కూడా స్పందించారు. "ఈ ప్రచారం ఎలా మొదలైందో తెలియదు. కానీ, పవన్‌తో పని చేయడమన్నది ఎప్పటికైనా అద్భుతమైన కల. 'రిపబ్లిక్' మూవీ ఆలోచన కూడా ఆయనను దృష్టిలో పెట్టుకుని వచ్చిందే. ఏదైనా కథ మా ఇద్దరికీ ఆసక్తిగా అనిపిస్తే, కచ్చితంగా సినిమా చేస్తాం. ప్రస్తుతం అద్భుతమైన ప్రతిభతో కూడిన వ్యక్తులతో కలిసి రాజకీయేతర స్క్రిప్టులను సిద్ధం చేస్తున్నా.

మనందరికీ సరికొత్తగా అనిపించే విభిన్న ఆలోచనలను అన్వేషిస్తున్నా. రాజకీయాలకు సంబంధించి ఎలాంటి సినిమాలు చేయడం లేదు. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తా" అని దేవా కట్టా పేర్కొన్నారు.

## మర్చిపోయిన
# సినిమా ఓటీటీకి

ఆది పినిశెట్టి రివెంజ్ డ్రామా 'శబ్దం' 2025 ఫిబ్రవరి 28న థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమాకు బాక్సాఫీస్ దగ్గర మిక్స్‌డ్ రెస్పాన్స్ లభించింది. దర్శకుడు అరివళగన్ డైరెక్ట్ చేసిన సినిమాలోని హారర్, ఎమోషన్ అంశాలు ప్రేక్షకులను కొంతవరకు మెప్పించాయి. అయితే, ఈ సినిమా విడుదలై ఏడాది కావొస్తున్నా.. ఇంకా డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లలో స్ట్రీమింగ్‌కు రాకపోవడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి తగ్గిపోయింది. కానీ, ఊహించని విధంగా ఇప్పుడు ఈ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ జీ5లో స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఏడాది దాటిన తర్వాత సినిమా స్ట్రీమింగ్‌కు రావడంతో ప్రేక్షకులు అవాక్కవుతున్నారు. అయితే, ఓటీటీలో కేవలం తమిళ భాషలో మాత్రమే ఈ సినిమా అందుబాటులోకి రావడం తెలుగు ప్రేక్షకులను నిరాశకు గురిచేసింది. తెలుగు స్ట్రీమింగ్‌కు సంబంధించి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం గమనార్హం. మరి కేవలం తమిళంలో మాత్రమే అందుబాటులోకి వచ్చిన ఈ చిత్రం ఓటీటీలో ఎలాంటి 'శబ్దం' చేస్తుందో చూడాలి.



# వెనక్కెళ్లిన గోట్



శ్రీరామనవమి పండుగ పురస్కరించుకుని సినిమాలు థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నాయి. అయితే ఈ రేసులో ఉండాల్సిన 'గోట్' సినిమా వాయిదా పడటం చర్చనీయాంశమైంది. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించిన గోట్ చిత్రాన్ని దర్శకుడు వేదవ్యాస్ తెరకెక్కించగా, ఎమ్ చంద్రశేఖర్ నిర్మించారు. చాలాకాలంగా షూటింగ్ దశలో ఉన్న సినిమా, డైరెక్టర్ నరేష్ కుప్పిలి మరియు నిర్మాతల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా ఆలస్యమైంది. అన్ని అడ్డంకులు దాటుకుని మార్చి 26న విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం, ఇప్పుడు పోస్ట్–ప్రొడక్షన్ దశలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా వాయిదా పడింది. బెటర్ క్వాలిటీతో సినిమాను అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని మేకర్స్ తెలిపారు. ఏప్రిల్ 6న ట్రైలర్ విడుదల చేసి, అదే రోజు కొత్త రిలీజ్ డేట్ ప్రకటించనున్నట్టు వెల్లడించారు. ఇక బ్యాండ్ మేళం చిత్రం మాత్రం శ్రీరామనవమి సందర్భంగా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన సినిమాను సతీశ్ జవ్వాజీ దర్శకత్వంలో కోన వెంకట్ నిర్మించారు. మెగాస్టార్ చిరంజీవి ట్రైలర్ లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేయడం సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది.

# ట్విస్ట్‌లిస్తున్న అట్లీ

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఏఏ22'. చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా సీక్రసీ మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ–లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన "నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి" అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీవర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది.

